ప్రజాశక్తి

Vol. 5, no. 14

(Oct. 4, 1944)

బెజవాడ, 1944

Record no. 683

Prajāśakti

Vol. 5, no. 14

(Oct. 4, 1944)

Bejavāḍa, 1944

Record no. 683

Regd. No. M. 4486 0-2-0

ప్రజాశక్తి

సంపుటి 5 బుధవారం 4-10-44 సంచిక 14

> ## మేం మిత్రులుగానే విడిపోయాం
>
> —"మేమిద్దరం శత్రువులుగా విడిపోలేదు; మిత్రులుగానే విడిపోయాం. ఈ విషయాన్ని నేను స్పష్టంగా చెప్పదలచు కున్నాను.....మేం ఏకాభిప్రాయానికి రావడంలో విఫలత చెందామంటే, దాని అర్థం మా విశ్వాసానికది అగ్నిపరీక్ష అన్నమాట. వివిధ మతాలకుచెందిన ప్రజల్లోవిలువైన ఐక్యత కుదరడానికి ఇంకా యెక్కువ తీవ్రంగా ప్రయత్నించటం అవసరమన్నమాట."
>
> — గాంధీజీ
>
> ★
>
> "సంప్రతింపులు భగ్నమైనప్పటికీ, ప్రజలు ద్వేషభావాన్ని ఎక్కువ చేసుకోకూడదు. ఇది తుది ప్రయత్నం కాదని మేం గట్టిగా నమ్ముతున్నాం."
>
> — జనాబ్ జిన్నా

★ సంపాదకీయం

"మరోసారి అంతా కలిసి ఆలోచిద్దాం"

★

కాంగ్రెసువాదులకు, లీగర్లకు కామ్రేడ్ పి. సి. జోషి విజ్ఞప్తి

గాంధీ - జిన్నా సమావేశం విఫలం కావడంవల్ల, దేశానికెంతైనా నష్టం వాటిల్లింది. బ్రిటిష్ నిరంకుశాధికారులు సంతోషంతో చంకలెగురవేస్తున్నారు; ఇతర దేశాలలో మన కండగావున్న మిత్రులంతా విచారసముద్రంలో మునిగి పోయారు. "భారతదేశంయొక్క ప్రధాన నాయకులే ఎట్టి ఒడంబడికకు రాలేనప్పుడు, మనమెలా జోక్యం కలిగించు కుంటాం?" అని చర్చిల్ - అమెరీ అత్మసంతృప్తితో అర్థమైంట్లు విసురుతూంటే, మన బ్రిటిష్ మిత్రులు ఏమి సమాధానం చెబుతారు? ఏ విధంగా తమ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తారు?

ఇక మన దేశంలో ప్రజల విషయం చెప్పనవసరమేలేదు. అంతా నేడు దుఃఖ సముద్రంలో మునిగి తేలుతున్నారు. నిస్పృహ, నిరాశ దేశమంతటా వ్యాపించేటట్లుంది. మన దేశభవిష్యత్తును నిర్ణయించవలసిన గొప్పనాయకులే ఏకాభిప్రాయానికి రాజాలనప్పుడు, నానాటికీ దేశంలో విషమిస్తూన్న పరిస్థితుల నెదుర్కోవడానికి ప్రజల్ని ఏకతాటిమీద నడిపించగల నాయకులెవరు? ఎవరు దేశానికి దారిచూపగలవారు? - అని నిస్పృహచెందుతున్నారు.

సమావేశం విఫలంకావడానికి కారకులెవరని చర్చించడం వల్ల ఎట్టి ఉపయోగం కలుగకపోగా, ఎంతోహాని సంభవిస్తుంది. ఇప్పుడు దేశంలోవున్న ఐక్యతకే భంగం వాటిల్లుతుంది. అట్టి చర్చలవల్ల ఫలితం ఒకరి తలలు మరొకరు పగలగొట్టుకోవడంతప్ప మరొకటి కాదు.

గాంధీ-జిన్నా లేఖలవల్ల ఒకవిషయం మనకు స్పష్టంగా తెలుస్తోంది. గాంధీజీ జిన్నాను, జిన్నా గాంధీజీని, తమ తమ దృక్పథాలకు మార్చడానికే ప్రయత్నించారు. కాని రాజీపడటానికి సిద్ధంకాలేదు. అందువల్ల సంప్రతింపులు విఫలంకావడం తప్పనిసరిఅయింది. మన జాతీయ జీవనంలో వున్న పరమోత్కృష్టమైన కొన్ని ఆశయాలు వారిద్దరిలోనూ ఉన్నాయి. ఇద్దరి దృక్పథాలూ వేరువేరైనప్పటికీ, యిద్దరికీ అంగీకారయోగ్యమైన ఒక రాజీమార్గం నేటి పరిస్థితుల్లో అత్యవసరం. అప్పుడే వారిద్దరిమధ్య అంగీకారం సాధ్యమవుతుంది. అట్టిఅంగీకారం కాంగ్రెసు-లీగ్ ఒడంబడికకు కూడా దారి తీస్తుంది. కాని, గాంధీజీ-జిన్నా ఇద్దరూ ఒకరి కొకరికి సంబంధం లేకుండా చెరోమార్గం అవలంబించారు. ఈవిషయం వారి ప్రకటనలవల్లనే స్పష్టం అవుతోంది.

సంప్రదింపులు విఫలమయాక వారిచ్చిన సంయుక్త ప్రకటనలో, తిరిగి వారు సమావేశం కావడానికి అవకాశం ఉన్నట్లు ఆశను వెల్లడించారు. బొంబాయి సమావేశంవల్ల వీరిద్దరూ స్నేహితులయారు. ఒకరి దృక్పథాన్ని మరొకరు యిప్పుడు బాగా స్పష్టంగా అర్థం చేసుకున్నారు. ఇప్పుడు అభిప్రాయ భేదాలు స్పష్టమైన భాషలో వున్నాయి. ప్రస్తుతం మనమెంత నిరాశలో మునిగి వున్నప్పటికీ, వీటి ప్రాధాన్యతను మనం గుర్తించితీరాలి.

జనాబ్‌జిన్నా గాంధీజీని ఒప్పించజాలనందుకు కారణం మహమ్మదీయేతరులకు నచ్చే విధంగా పాకిస్తాన్ ప్రాముఖ్యతను స్పష్టీకరించలేక పోవడం. లాహోరులో ఆమోదించబడినపాకిస్తాన్ తీర్మానం ఎలాఅమల్లోకిరావాలో, అధిమాత్రమే ఆయన వివరించారు. మొదటివిషయం ఏమంటే, పాకిస్తాన్ రాజ్యాంగ సంపూర్ణాధికారాలుగల ఒకస్వతంత్రప్రభుత్వం. రెండోది. దాని సరిహద్దులనిర్ణయం పరస్పర ఒడంబడిక ద్వారా సాధ్యం అవుతుంది. మూడవది, పాకిస్తాన్-హిందూస్తాన్‌ల మధ్య ఉండవలసిన సంబంధబాంధవ్యాలు ఆయా "భావిరాజ్యాంగాన్ని నిర్ణయించే ప్రజాప్రతినిధి పరిషత్తు" (Constituton making-bodies) మధ్య జరిగే ఒడంబడికలద్వారా నిర్ణయ మవుతాయి.

గాంధీజీ స్వయంనిర్ణయసూత్రాని కనుగుణ్యంగా ముస్లిం లీగ్ కోర్కెను అంగీకరించుటకు తీవ్రంగా ప్రయత్నించాడు. సంపూర్ణస్వాతంత్ర్యంగల భారతరాజ్యాంగంలో స్వయం నిర్ణయహక్కుగల వేర్వేరు భాగాలు సమిష్టికుటుంబంలో మాదిరిగా కలసి వుండాలని గాంధిజీ అభిప్రాయం. అట్టి రాజ్యాంగంనుండి పాకిస్తాన్ ఏరియా విడిపోయి వుండడానికి కూడా ఆయన అంగీకరించాడు. అయితే, సార్వజనిక వోటింగు (ప్లెబిసైట్)ద్వారా ప్రజాభిప్రాయం ఏమో తెలియనిదే సర్వాధికారాలు గలిగిన స్వతంత్ర ప్రభుత్వా లేర్పడ్డానికి ఆయన వ్యతిరేకం. అట్టి సార్వజనిక వోటింగులో, ముందుగానే రెండురాజ్యాలకూ సంబంధించిన సంబంధబాంధవ్యాలు నిర్ణయించబడాలని గాంధీజీ వాదన. జిన్నా యీ వాదనకు వ్యతిరేకి. పాకిస్తాన్ రాజ్యాల స్వతంత్రహోదా విషయంలో గాంధీజీ బేరం ఆడుతూన్నట్లు జిన్నా అర్థంచేసుకున్నాడు. అందువల్ల గాంధీజీ ప్రణాళికను త్రోసివేశాడు.

అయినా, మనమొక విషయాన్ని మరిచిపోకూడదు. భేదాభిప్రాయాల్లోనే పరిష్కారబీజాలుకూడా వున్నాయి. పాకిస్తాన్ అంటే, ముస్లింజాతులు వారివారి జన్మభూముల్లో స్వతంత్రంగా జీవించే హక్కు తప్ప మరొకటికాదని. అది న్యాయమైన ప్రజాస్వామ్య కోరికఅనీ, యిది బ్రిటిష్ ప్రభుత్వంనుండి కాంగ్రెసుకోరే సంపూర్ణ స్వాతంత్ర్యకోర్కె వంటిదే అనీ, ముస్లింలీగ్ నాయకత్వం స్పష్టీకరించాలి. అలా స్పష్టీకరిస్తేనేగాని పాకిస్తాన్ కోర్కెను కాంగ్రెసు అంగీకరించదు. ఆ కోర్కెను ఆచరణలోపెట్టేది వయోజన వోటింగుపద్ధతి ప్రకారం ఎన్నుకోబడు ప్రజాప్రతినిధి పరిషత్తనికూడా ముస్లింలీగ్ నాయకులు స్పష్టంచేయాలి. హిందుస్థాన్‌తో పాకిస్తాన్‌కు ఎలాంటి సంబంధం ఉంటుందో కూడా నిర్ణయించేది పాకిస్తాన్‌లో నివశించే ప్రజలు తప్ప మరొకరుకారని విశదపరచాలి. కొన్ని ప్రధానసమస్యలపై సహకారం అవసరమేనను విషయం జిన్నాగారుకూడా గుర్తిస్తున్నారు. ముస్లింలుకోరే యీన్యాయమైన హక్కును నిష్కల్మషమైన ఏ భారతీయుడు నిరాకరించజాలడు. అయితే, పాకిస్తాన్ రాజ్యాంగం ఎలావుంటుందో నిర్ణయించుకునేది అక్కడి ప్రజలేనని అతన్ని ముందుగా ఒప్పించాలి.

బ్రిటిష్ ప్రభుత్వం ప్రసాదించే పాకిస్తాన్ స్వతంత్ర రాజ్యంగావుండదు. ముస్లింలు యిప్పుడుకోరే సరిహద్దులైనా వుండవు.

గాంధీజీ మొదలైన భారతదేశ నాయకులు యింకా ధైర్యంతో యీ సమస్యను పరిష్కరించడానికి పూనుకుంటేగాని, యుద్ధకాలంలో జాతీయ ప్రభుత్వ స్థాపన సాధ్యం కాదు. సంపూర్ణ స్వరాజ్యం అంటే అర్థం, వేర్వేరుస్వతంత్ర రాజ్యాలు అన్యోన్యంగా సోదరభావంతో కలసిమెలసి యుండడమని మాత్రప్రాయంగా అంగీకరించి నంత మాత్రాన సరిపోదు. వాటి స్వతంత్ర హోదాను ఎట్టి షరతులు లేకుండా మనం ముందుగానే గుర్తించివలసియుంటుంది. ముందుగానే కొన్ని షరతులు విధించడం మానివేయాలి. మనకు పొరుగునవున్న పఠాన్ సోదరులు, బెలూచీ ప్రజలు, సింధీలు, బెంగాలీలు, పంజాబీలు, మనకు సోదరులేగాని, అన్యులు కారు; శత్రువులు అసలేకారు. వారినుండి మనం భయపడవలసినదేమీలేదు. స్వాతంత్ర్యస్థాపనకై వారి హృదయపూర్వక సహకారం మనకవసరం. మనతోపాటు వారుకూడా సంపూర్ణ స్వాతంత్ర్యం సంపాదించుకొని, ప్రజాస్వామ్య ప్రభుత్వాన్ని ఏర్పరచుకొన్నపుడు మనకు వ్యతిరేకంగా ఎట్టి పనికి పూనుకోరనే విశ్వాసం మనలో ఉండాలి. వారికీ, మనకూ సమానంగా ప్రాధాన్యతవహించు విషయాల్లో వారి పూర్తి సహకారం మనకు లభించి తీరుతుంది. భారతదేశ స్వాతంత్ర్యం మన కెంత ముఖ్యమో, వారికి అంతే ముఖ్యం. వారి దేశభక్తిలో మనకు పూర్తి విశ్వాసం ఉండాలి. ప్రజాస్వామ్య పరిపాలన అంటే అర్థం, ప్రజలకు సర్వాధికారం అనే విషయాన్ని మనమంతా గ్రహించాలి. అప్పుడు ముస్లింలు కోరే హక్కు ఎంత న్యాయమైనదో మనకు బోధపడుతుంది. ముస్లింనాయకులింతవరకూ తమ కోర్కెను స్పష్టంగా విశదీకరించకపోయినా, మనం మాత్రం ముస్లిం ప్రజలు కోరే న్యాయమైన హక్కును అంగీకరించుదాం.

సంప్రతింపులు విఫలమైన వెంటనే, గాంధిజీ ప్రార్థన సమయంలో చెప్పిన మాటలేమిటి? ప్రజలు, పత్రికలు తిరిగి తమ్ము కలపవలసియుంటుందని విజ్ఞప్తి చేశాడు. కాంగ్రెసు - లీగ్ ఒడంబడికకై కమ్యూనిస్టుపార్టీ శాయశక్తుల పనిచేస్తోంది. ఇకముందు యింకా యెక్కువ దృఢ విశ్వాసంతో పనిచేస్తుంది.

కాంగ్రెసువాదులు, ముస్లింలీగర్లు, అందరూ మరోసారి ఏయే విషయాలపై అభిప్రాయభేదం ఏర్పడిందో గట్టిగా ఆలోచించవలసిందని మేం విజ్ఞప్తిచేస్తున్నాం. సోదరభావముతో వాటిపై చర్చలు సాగించి, ఏకాభిప్రాయానికి రావలసిందని కోరుతున్నాం. అందరికీ సమానంగా ఎదుర్కొనే సమస్యలపై కాంగ్రెసువాదులు, ముస్లింలీగర్లు - అందరూ, కలసి పనిచేయవచ్చునని గాంధీజీకూడా అంగీకరిస్తున్నాడు. ఆహార ధాన్యాల కొరత, కరువు, అంటురోగాలు - ఇవన్నీ మన ప్రజల్ని పీడిస్తున్నాయి. సహాయంకొరకు వారెదురు చూస్తున్నారు. కాబట్టి, మరోసారి మనం అంతా కలిసి ఆలోచిద్దాం. లీగ్ ఆశయం, కాంగ్రెసు ఆశయం, రెండిటిఆశయం, సిద్ధింపడానికిమార్గం ఆలోచిద్దాం. అందరం కలిసిపని చేద్దాం; మన పీడితప్రజలకు సహాయంచేద్దాం; ప్రజల్లో ప్రవేశిద్దాం; ప్రజలతో బాధపడదాం. అప్పుడు తిరిగి మన జాతీయనాయకులిద్దరినీ సమావేశపరుద్దాం; మళ్ళీ విడిపోకుండా ఉండేలా సమావేశపరుద్దాం. మన స్వాతంత్ర్య సైనికుల్ని వారు వదలడానికి గాను తిరిగి వారిని సమావేశపరుద్దాం.

నిమ్న జాతుల కోర్కెలు : మన కర్తవ్యం

— మద్దుకూరి చంద్రశేఖరరావు

ఈ వారంలో నిమ్నజాతుల నాయకుడు డాక్టరు అంబేద్కరు మద్రాసులోను, ఆంధ్రదేశంలోనూ ఉపన్యాసాలిస్తూ సంచారం చేసారు. అఖిలభారత నిమ్నజాతుల ఫెడరేషను కార్యవర్గం మద్రాసులో సమావేశమై, ముఖ్యమైన కొన్ని తీర్మానాలు చేసింది. అంబేద్కరుగారు తన ఉపన్యాసాలలో, నిమ్నజాతుల కష్టనిష్ఠురాలను గురించి అనేక సమస్యలను లేవదీశారు. ఈ వ్యాసంలో వాటిని గురించి చర్చించబడింది.

భారతదేశం పరాధీనదేశం. భారతప్రజ లందరం బానిసలం. బ్రిటిషు సామ్రాజ్యవాదులు మనలను దోచుకొంటున్నారు. బానిసలమైన మనకు గౌరవంలేదు. ఉదాహరణకు దక్షిణాఫ్రికాలోని భారతీయుల స్థితి చూడండి. అచటి తెల్లవారు మనవారిని ఎంత హీనంగా చూస్తారు? రైలుబండ్లలో ఉన్నత తరగతిలో ప్రయాణం చేయకూడదు. ఒకప్పుడు గాంధీజీనే అలా ఎక్కినందుకు బండిలోనుంచి బయటికి గెంటివేశారు. భారతీయులు ఆస్తిని సంపాదించకూడదనే నిషేధం యిప్పటికీ వుంది. తెల్లవాళ్లు నివసించే ప్రదేశాలలో భారతీయులు ఇండ్లు కట్టుకోగూడదు. ప్రత్యేకంగా ఏర్పరచిన చోట్ల తమగూడాలను నిర్మించుకోవాలి. తెల్లవారు నివసించేచోట్ల మనవారు దుకాణాలు పెట్టరాదు. వర్తకం చేయరాదు. నేమేల, యితరదేశాలలో నివసించే భారతీయులకు పౌరసత్వహక్కులు లేవు. ఈ విషయం తలచుకుంటే, భారతదేశం బానిసదేశం అవటంవల్లనే గదా మన సోదరులకు ఇతర దేశాలలో వెలి, అవమానం! అని ప్రతి భారతీయుని హృదయం తరుక్కుపోతుంది. నిజంగా మనకు అభిమానం పొడుచుకువస్తుంది.

కాని, మనదేశంలోనే ఎంత అన్యాయం వందలకొలది సంవత్సరాలనుంచి సాగుతూంవో చూడండి. హిందూ సమాజంలో మాదిగలు, మాలలు వగైరా ఆదిమాంధ్రులు, నిమ్నకులాలవారు పొందే ఆదరణ విషయం ఒకసారి హృదయాలు విప్పి పరిశీలించండి. ఉన్నత కులాలవాళ్ళు వారిని అంటరాదు; ముట్టరాదు. ప్రత్యేకంగా మురికిప్రదేశాలలో వారికి గూడాలు ఏర్పాటుచేశారు. పల్లెలలో కొన్నిచోట్ల యింకా నిమ్నకులాలవాళ్ళు కాలిడకూడని "పవిత్ర" వీధులు వున్నాయి. వారిని నీచంగా చూడటం, బూతులు తిట్టటం సామాన్య విషయంగా పరిగణించబడుతూంది. పట్టణాలలోనైతం చూడండి! ఇప్పటికీ హరిజనులను చాలహోటళ్లలోకి రానివ్వరు. వారు నివసించడానికి ఇండ్లు అద్దెకు యివ్వరు. ఏమంటే వారు అంటరానివారు. అస్పృశ్యుల విద్యాభివృద్ధికి మద్రాసుప్రభుత్వం కల్పించిన ఉచితవేతనాలపద్ధతినైతం ఈమధ్య గుంటూరు వగైరా జిల్లాబోర్డులు రద్దుచేశాయి. పొరుగుదేశాలలో భారతీయులం అస్పృశ్యులం. కాని మనదేశంలోనే మనలో ఒక భాగాన్ని నిమ్నకుల సోదరులను అంటరానివారిగా ఎంచుతున్నాం! ఎంత సిగ్గుచేటు!

కొత్త చైతన్యం

పరిస్థితులు యిలా అధ్వాన్నంగా వున్నవుడు, ఇప్పుడిప్పుడే మేల్కొంటున్న నిమ్నకులాలవారికి, చైతన్యం పొందిన వారి నాయకులకు, ఉన్నతకులాలవారిపై తిరస్కారం వుండటంలో ఆశ్చర్యం ఏముంది? తమకు రక్షణలు కావాలనటంలో విచిత్రం లేదు.

గాంధీజీ రాజకీయాలలో ప్రవేశించినప్పటి నుండీ అంటరానితనమనే పిశాచాన్ని పారద్రోలాలని ప్రచారం చేశారు. హిందూ సమాజంలో ఒక భాగమైన నిమ్నకులాలను లేని అధికృత తన కెందుకని అందర్నీ ఖండించారు. దక్షిణదేశంలో హరిజనస్త్రీలు రవికలు ధరించరాదనే నిషేధం చూచి గాంధీ హృదయం తరుక్కుపోయింది. ప్రాయశ్చిత్తంగా తానుచొక్కాను విసర్జించారు.

రెండవ రౌండుటేబిలు సభకు కాంగ్రెసు తరపున గాంధీజీ, నిమ్నజాతుల తరపున అంబేద్కరు హాజరయ్యారు. అంబేద్కరు నిమ్నజాతులకు రక్షణ కావాలని, ప్రత్యేక నియోజకవర్గాలు కావాలని కోరారు. ఉన్నత కులాలవారు తమవారిని వెతేయిబ్బందులను వర్ణించారు. గాంధీజీ విషమృతై అస్పృశ్యత భారతీయులకు కళంకమన్నారు. హరిజనులకు జరుగుతున్న అన్యాయానికిగాను అంబేద్కర్ 'తన ముఖాన ఉమిసినా' తప్పులేదన్నారు. అంటరానితనం అనే కళంకాన్ని హిందూసమాజం నుండి తుడిచివేస్తానని ప్రతిజ్ఞ చేసారు.

గాంధీజీ హెచ్చరిక

మనలోవున్న దురాచారాలను, విభేదాలను బ్రిటిషు సామ్రాజ్యవాదులు తమ లాభానికి వినియోగించుకోవడంలో ఆశ్చర్యం లేదు. 1932 లో బ్రిటిషుప్రభుత్వం ప్రకటించిన 'కమ్యూనల్ ఎవార్డులో' నిమ్నజాతులకు ప్రత్యేక నియోజకవర్గాలు ఏర్పరచింది. దీనిని అసమ్మతి తెలుపుతూ గాంధీజీ ఎరవాడ జైలులో ఉపవాసంచేశారు. అపుడు దేశమంతా కల్లోలపడింది. హిందూనాయకులు, నిమ్నజాతుల నాయకులు అంతా పూనాలో సమావేశమై రాజీ చేసికొన్నారు. దానినే 'పూనా ఒడంబడిక' అంటారు. దాని ప్రకారం హరిజనులకు ప్రత్యేక నియోజకవర్గాలు తొలగించబడినాయి. కమ్యూనల్ ఎవార్డులో యిచ్చిన స్థానాలకు రెట్టింపు హరిజనుల ప్రతినిధులకు సంయుక్త నియోజకవర్గాలలోనే ప్రత్యేకించబడ్డాయి.

సంఘంలో అక్రమాలు ఉన్నంతకాలం మనలో చీలికలు ఉంటాయి. వాటిని తొలగించుకోవడం దేశభక్తుల కర్తవ్యం. అందుకే గాంధీజీ 1933 లో హరిజనసేవాసంఘాన్ని స్థాపించారు. నిమ్నజాతుల ఉద్ధరణకు నిధిని పోగుచేసారు. నిమ్నజాతుల బాలబాలికల చదువుకు సాయంచేయ పూనుకున్నారు. దేవాలయాలలో హరిజనులకు ప్రవేశహక్కు కోసం కృషిచేసారు.

హరిజనసేవాసంఘం ప్రచారం సాగించింది. కొందరు బాలబాలికలకు చదువు చెప్పించింది. కొన్నిచోట్ల హరిజనుల కొరకు బావులు త్రవ్వించింది. కాని అస్పృశ్యతా కళంకం యింకాతొలగిపోలేదు. నేటికి నిమ్నజాతులప్రజలకు అనేక యిబ్బందులున్నాయి. అందుచే హరిజనయువకులలోను, నిమ్నజాతుల నాయకులలోను అసంతృప్తివుంది. సెప్టెంబరు 21వ తేదీన హరిజనకార్యకారవర్గం గాంధీజీని బొంబాయిలో కలిసికొంది. తమ వారికి ఇండ్లు అద్దెకు దొరకటంలేదని వారు చెప్పుకొన్నారు. ఈవిషయమై గాంధీజీ ప్రార్థన సమయంలో ఎంతో నొచ్చుకున్నారు. సిగ్గుతో తలవంచుకోవలసివస్తూందని గాంధీజీ అన్నారు. అంటరాని తనాన్ని వేళ్లతో పెకలించివేయనిచో, హిందూమతం నశించిపోతుందని హెచ్చరించారు.

మద్రాసులో జరిగిన నిమ్నజాతుల వర్కింగ్‌కమిటీ తీర్మానాలు, డాక్టరు అంబేద్కరు ఉపన్యాసాలు పై అసంతృప్తినే కనపరుస్తున్నాయి. మనుస్మృతిని ఉదాహరణగా చూపి కాకినాడ ఉపన్యాసంలో బ్రాహ్మణమతాన్ని అంబేద్కరు ఆక్షేపించారంటే ఆశ్చర్యంలేదు. మద్రాసు కార్పొరేషను ఆహ్వానికి జవాబుగా ఆయన యిచ్చిన ఉపన్యాసంలో అంబేద్కరు ప్రభుత్వం అవలంబించుతున్న లేబరు పాలసీని సమర్థించారు. దీనినిచూచి ప్రభుత్వ ఏజెంటని యీసడించడంలో అర్థంలేదు. నిమ్నజాతుల ఫెడరేషను మద్రాసు సమావేశం డాక్టరు అంబేద్కర్‌ను తమ నాయకునిగా గుర్తించుతూ తీర్మానించింది. వెళ్ళినచోటల్లా నిమ్నజాతులప్రజలు, హరిజన నాయకులు స్వాగతంలో పాల్గొంటున్నారు. కాంగ్రెసుతరపున శాసనసభ్యులుగా ఎన్నుకోబడిన హరిజన ప్రతినిధులుకూడా డాక్టరు అంబేద్కరును ఆహ్వానించారు. నిమ్నజాతులలో వున్న అసంతృప్తిని యిది తెలుపుతోంది. వారి నాయకునిగా అంబేద్కరు ఎంచబడుతున్నారనే విషయం దీనివల్ల స్పష్టమవుతుంది. కాబట్టి అంబేద్కరు లేవదీసిన సమస్యలను ముఖ్యంగా మద్రాసు సమావేశం చేసిన తీర్మానాలను దేశహితం కోరేవారంతా సాకల్యంగా పరిశీలించాలి.

నిమ్నజాతుల ఫెడరేషన్ తీర్మానాలు

నిమ్నజాతులు దేశంయొక్క జాతీయ జీవనంలో ఒక ప్రత్యేక భాగంగా గుర్తించబడాలని యీసమావేశం కోరింది. భావి రాజ్యాంగ విధానంలో అలా చేర్చాలంది. మైనారిటీల సమస్య పరిష్కరించబడాలని కోరింది. అలాంటి పరిష్కారానికి ఆతురతను వెల్లడించింది కాని "గాంధీజీ-జిన్నాగార్ల మధ్య జరుగుతున్న రహస్య సంభాషణలకు" అసమ్మతిని తెలిపింది. భారతదేశ గమ్యస్థానాన్ని త్వరగా చేరడానికి నిమ్నజాతులకు హిందువులకు మధ్య శాంతి, సుహృద్భావం అవసరమని తెలిపింది. అధికారం భారతీయులకు హస్తగతం చేసేముందు, స్వతంత్ర భారత రాజ్యాంగ విధానానికి నిమ్నజాతుల అంగీకారం పొందాలని ప్రకటించినందుకు యీకమిటీ వైస్రాయిని అభినందించింది.

భావిరాజ్యాంగం నిమ్నజాతుల ఆమోదాన్ని పొందాలంటే, యీ క్రింది ఏర్పాట్లు వుండాలని కోరింది. (1) రాష్ట్రబడ్జెటులలోను, కేంద్రప్రభుత్వ బడ్జెటులలోను కొంత సొమ్ము నిమ్నజాతుల కొరకు ప్రత్యేకించబడాలి. (2) దాని నిమ్నజాతుల విద్యకొరకు ఖర్చు పెట్టాలి. (3) గవర్నమెంటు భూములను నిమ్నజాతులకొరకు ప్రత్యేకించాలి. (4) మ్యునిసిపాలిటీలలోను, లోకల్ బోర్డులలోను, శాసనసభలలోను, నిమ్నజాతులకు వారి జన సంఖ్యను అనుసరించి ప్రాతినిధ్యం యివ్వాలి. (5) ఉద్యోగాలలోను, పబ్లిక్ సర్వీసు కమీషన్లలోను జనసంఖ్యనుబట్టి స్థానాలు నిర్ణయించాలి. ఈ హక్కులు అమలు జరుగుతున్నాయో లేదో చూడడానికి ఒకఉద్యోగిని నియమించాలని కోరింది.

ఇవి న్యాయమైన హక్కులే. నిమ్నజాతులవంటి వెనుకబడిన ప్రజలకు యిలాంటి రక్షణలు యివ్వడానికి ప్రతి దేశభక్తుడు అంగీకరించుతాడు.

ఇంకో తీర్మానంలో వర్కింగ్‌కమిటీ రాష్ట్ర మంత్రివర్గాలలోను, కేంద్రమంత్రివర్గంలోను నిమ్నజాతులకు జనసంఖ్యనుబట్టి ప్రాతినిధ్యం వుండాలని కోరింది. ఇది [illegible] సబబైన కోర్కె. ఇందుకు ఎవరూ ఆక్షేపించరు. కాని మంత్రులను ఏగ్రూపుకు ఆగ్రూపే ఎన్నుకోవాలని కోరారు. ఇలా జరిగితే ఒకవాలకీయ పాలసీపై ఎన్నికలు జరుగవు. మంత్రివర్గానికి సమష్టిబాధ్యత వుండదు. ఎవరికి వారే వుండి, సమిష్టినిర్ణయాలకు అవకాశం లేకుండా పోతుంది. కాబట్టి మంత్రివర్గాలలో నిమ్నజాతులకు కొన్నిస్థానాలువుండాలనేంతే. కాని మంత్రివర్గాలు ఏర్పడటానికి వారు సూచించిన విధానం సరియైనదికాదు.

ప్రత్యేక సెటిల్మెంటులు

ఇంకో తీర్మానంలో అంటరానితనం పూర్తిగా తొలగిపోవడానికి నిమ్నజాతులకు ప్రత్యేక సెటిల్మెంటులు కావాలని కోరింది. ఉన్నతకులాల నిరంకుశత్వం అంతం కావడానికి ప్రత్యేకంగా నిమ్నజాతుల గ్రామాలను ఏర్పరచాలని, భూములను సంపాదించి యివ్వాలని కోరింది.

వ్యవసాయానికి లాయకయినబంజరులను, ప్రభుత్వ ఆధీనంలోవున్న భూములను, నిమ్నజాతులకు యివ్వాలనిందే. అందుకెవరూ వ్యతిరేకించలేరు. కాని ఇతరులు సాగుచేస్తున్న భూమినికొని నిమ్నజాతులకు యివ్వమనడం ఆచరణసాధ్యమైన కోర్కెకాదు. అంతేగాక నిమ్నజాతులకు ప్రత్యేక సెటిల్‌మెంటులు నిర్మించాలనడం సరికాదు. ఇదివరకు వారిని ప్రత్యేకంగా సూడెములలో పెట్టారనీ, అంటరానివారిగా చూశారనేగదా మన ఆక్షేపణ! ఇలా వేరుగా పెట్టడంవల్ల తక్కిన ప్రజలలో వారు కలిసిపోవడానికి అవకాశాలు వుండవు.

ఇపుడు హరిజనపేటలు సాధారణంగా ఊరిబయట మురికి ప్రదేశాలలో వుంటున్నాయి. అందుచే హరిజనులకు ఆరోగ్యప్రదమైన మంచి ప్రదేశాలను ఇండ్లు కట్టుకోడానికి ప్రభుత్వాలు ఉచితంగా యివ్వాలి. గ్రామాలలోనే అలాంటి ప్రదేశముంటే ఇప్పించాలి. లేనిచో యితరుల భూములను ప్రభుత్వంకొని, హరిజనుల యిండ్లకు ఉచితంగా యివ్వాలి. ఇది వరకు కొలదిచోట్ల లేబరు డిపార్టుమెంటు యిప్పించిన యిండ్ల స్థలాలకు ప్రభుత్వం శిస్తువసూలుచేస్తోంది. పేదలైన హరిజనులు యీ బాకీలు తీర్చలేక, మరల ఆ స్థలాలను తాకట్టుపెడుతున్నారు. అందుచే, యిచ్చిన ఇండ్ల స్థలాలు క్రమంగా షావుకార్లచేతుల్లోకి పోతున్నాయి. అందుచే యికముందు ప్రభుత్వం హరిజనులకు ఉచితమైన యిండ్ల స్థలాలను ఉచితంగాయివ్వాలి. (మిగతా 7 వ పేజీ)

కొత్తప్రచురణలు

నేటి హైదరాబాదు —

మన కర్తవ్యం	రు 1-12-0
అధికాహారోత్పత్తి	0-5-0

ప్రజాశక్తికార్యాలయం, బెజవాడ

దురాక్రమణ గావించిన దేశాలనుండి నష్టపరిహారం పుచ్చుకోగూడదా?

ప్రశ్న

రుమేనియాపైన, ఫిన్లాండుపైన విధించిన నష్టపరిహారాలను గురించి కొందరు యిలా ప్రశ్నించుతున్నారు. సోవియట్‌యూనియన్ ఆదర్శప్రాయమైన ప్రజారాజ్యం గదా! ఓడిపోయిన దేశాలనుండి నష్టపరిహారం పుచ్చుకోవడం ఏమిన్యాయం? రుమేనియాను, ఫిన్లాండును హిట్లరు తరపున యుద్ధంలోకి దింపింది అంటొనెస్కో, మానర్‌హీమ్ వగైరా దుర్మార్గులేకదా! ఇందుకు ఆ యా దేశాల ప్రజలనుండి నష్టపరిహారం వసూలు చేయడం ఏమిసబబు?

సమాధానం

ఫాసిస్టు సామ్రాజ్యవాదులు హిట్లరు నాయకత్వాన ప్రపంచాన్నంతటినీ చుట్టబెట్టి, ప్రజల్ని బానిసలుగాచేసి, దోచుకోవాలని దురాక్రమణకు పూనుకున్నారు. అందుచే యీ యుద్ధం కేవలం కొన్ని దేశాల ప్రభుత్వాలమధ్య జరిగే యుద్ధం మాత్రమేకాదు. ఒకవైపున జర్మనీ, జపాను ఫాసిస్టులు, వారి తొత్తులు వున్నారు. మరొకవైపున సోవియట్ నాయకత్వాన ప్రపంచ ప్రజలు వున్నారు. ఫాసిస్టు పక్షం ఓడిపోవడమంటే మిత్రరాజ్యాలు గెలవడం మాత్రమే కాదు. ఫాసిస్టులచే పీడింపబడుతున్న ప్రజలందరి విజయమన్నమాట. ఫాసిస్టురాజ్యాలలోని ప్రజలకు కూడ నిరంకుశపాలననుండి విముక్తి అన్నమాట.

ఒక దొంగలగుంపు మీ వూరు మీద వడింది. ప్రజలను హింసించింది. చేతికి అందినదల్లా ఎత్తుకుపోయింది. వీలులేనిదల్లా ధ్వంసం చేసింది. మీవూరి ప్రజలను, మిత్రులను, అందరినీ కూడగట్టుకొని, దొంగల గుంపును వూరినుండి తరిమివేయడం ధర్మం గదా! ఎత్తుకుపోయిన సొమ్మును ఎచటదాచినవారే దొంగలకు బుద్ధిచెప్పి వసూలు చేయడం న్యాయంగదా! శాంతంగావున్న గ్రామంపై బడి బీభత్సం చేసిన దుర్మార్గులను దండించాలిగదా! వారిపై జరిమానావేసి, దోపిడివల్ల నష్టపడినవారి యిళ్ళు చక్కబెట్టుకోడానికి నష్టపరిహారం యిప్పించడం సబబేగదా! లేకపోతే దోపిడివల్ల ఛిద్రమైన కుటుంబాలు మళ్లా ఆర్థికంగా నిలదొక్కుకోలేవు గదా!

దొంగలు ఎలాగూ దుర్మార్గులే! నష్టపరిహారం వసూలుచేస్తే మీమంచితనంఏముంది? అని వేదాంతం ఎవరైనా చెబితే, అది తప్పని చివాట్లుపెడతాము.

ఇంక ఉదాహరణ వదిలేసి అసలు విషయానికి వద్దాం.

క్రిందటి యుద్ధంలోకంటే ఈసారి అనేకరెట్లుగా జర్మన్లువిధ్వంసం జరిపారు. వెనుకటిసారి ఫ్రాన్సు, బెల్జియంలలో మాత్రమే హెచ్చు విధ్వంసం జరిగింది. ఈసారి నాజీలు యూరపునంతా ఆక్రమించారు. పోలెండు, జెకోస్లోవేకియా, యుగోస్లోవియా, గ్రీసు, బెల్జియం, ఫ్రాంసు తదితర దేశాలలో ఆస్తిపాస్తులను ధ్వంసం చేశారు. సోవియట్ యూనియన్ సంగతి వేరుగా చెప్పనక్కరలేదు. పచ్చని పంటలతో, బ్రహ్మాండమైన పరిశ్రమలతో కళకళలాడే విశాలమైనభూమిని నాజీహంతకులు వ్మశానంచేశారు. గ్రామాలు, పట్టణాలు శ్మశానంచేసిపోయారు.

ఇలా నష్టపడిన దేశాలు, ఆయాప్రజలు తమ ఆర్థికస్థితిని పునర్నిర్మించుకోడంలో సహాయంకావాలి. అందుకు దురాక్రమణచేసిన దేశాలనుండి నష్టపరిహారం యిప్పించాలి. ఇది సబబేకదా!

ఇలా పుచ్చుకోకపోతే, ఏమి జరుగుతుంది? ఇతర దేశాలనుకొల్లగొట్టి, ధ్వంసం చేసినవాళ్ళు ఓడిపోయినా, ఆర్థికంగా సొష్టవంగానే వుంటారు. దురాక్రమణకు గురియైన దేశాలు గెలిచినా, తమఆర్థికస్థితినిచక్కబరచుకోడానికి - ఫాసిస్టులు నాశనంచేసిన ఇళ్ళు, గ్రామాలు, పట్టణాలుపునర్నిర్మించుకోడానికి - ఎంతోకాలం కష్టపడాలని వస్తుంది. దురాక్రమణ చేసినవారు ఓడిపోయాకకూడ సుఖపడటం; పీడితులు గెలిచాకకూడ కొంపా గోడీలేక బాధపడటం, అక్రమంకాదా! అందుచే ఫాసిస్టు దేశాలనుండి నష్టపరిహారాలు వసూలుచేయాలనిందే. ప్రజారాజ్యమైన సోవియట్ యూనియన్ ఇందుకే వసూలు చేస్తోంది.

అంతేగాక, రుమేనియావిషయంచూడండి. అక్కడ అంటొనెస్కు వగైరా ఫాసిస్టుముఠా అధికారానికి వచ్చింది. రుమేనియా ప్రజలను నిరంకుశంగా పీడించింది. నాజీ జర్మనీతో తోడిదొంగగా చేరి, సోవియట్ భూమిపై దండెత్తింది. పరిశ్రమలను, పంటలను నాశనం చేయడంలో పాల్గొంది.

సోవియట్ సైన్యాలు దురాక్రమణదారులను తమ దేశాన్నుంచి తరిమివేశాయి. 'అంటొనెస్కు' ముఠారోగం కుదర్చడానికి, రుమేనియా ప్రజలను నిరంకుశ పాలననుంచి రక్షించడానికి, ఎర్రసైన్యం రుమేనియాను విముక్తి చేయపూనుకుంది. రుమేనియా ప్రజలు ఎర్రసైన్యాన్ని ఆహ్వానించారు. దాని అండచూచుకొని, అంటొనెస్కు ముఠా ప్రభుత్వాన్ని కూలద్రోశారు. ప్రజాస్వామిక ప్రభుత్వాన్ని నెలకొల్పుకున్నారు. అంటొనెస్కు ముఠాను ఎర్రసైన్యానికి అప్పగించారు. జర్మనీపై యుద్ధం ప్రకటించారు. అనగా నిరంకుశపాలనను రుమేనియన్ ప్రజలు తొలగించుకోడంలో ఎర్రసైన్యాలు సాయపడినవన్నమాట.

అంటొనెస్కుముఠా ఆధ్వర్యం క్రింద రుమేనియాసైన్యాలు సోవియట్‌లో ఎంతో నష్టం కలుగచేశాయి. ధ్వంసం చేయబడిన ప్రాంతాల పునర్నిర్మాణానికిగాను సంధిషరతులలో సోవియట్ నష్టపరిహారం కోరింది. రుమేనియా 30 కోట్ల డాలర్ల విలువచేసే సరుకును 6 సంవత్సరాలలో చెల్లించాలని విధించింది. నిజంగా యిది అంటొనెస్కుముఠా కలుగజేసిన నష్టంలో ఎన్నోవంతు? ఇది రుమేనియా ప్రజలపై కక్షసాధించడానికికాదు. ఆర్థికస్థితిఛిద్రమై, కొంపా గోడీ కోల్పోయిన సోవియట్ ప్రజలకు పునర్నిర్మాణంలో సాయంచేయడానికి మాత్రమే.

ఐతే, రుమేనియా ప్రజలు యీనష్టపరిహారాన్ని ఎచటనుంచి చెల్లించాలి? అంటొనెస్కు ముఠానుబలపరచిన భూస్వాములఆస్తిని స్వాధీనం చేసికొని సోవియటుకు నష్టపరిహారం చెల్లించాలి. ఇందుకు తమప్రభుత్వాన్ని రుమేనియా ప్రజలు ఒత్తిడిచేయాలి. అంతేగాక, అంటొనెస్కు దుర్మార్గపరిపాలనను తొలగించడంలో తమకు సాయపడినందుకు రుమేనియాప్రజలు తమవంతు చెల్లించాలి. యుద్ధంలో నష్టపడిన సోవియట్ పునర్నిర్మాణానికి కానుకగాకూడ తాము చెల్లించుతున్నామని రుమేనియన్లు గుర్తించాలి.

ఫిన్లాండు చెల్లించాలనిన 30 కోట్ల డాలర్ల నష్టపరిహారం విషయం కూడా ఇంతే. కాని ఒకభేదం వుంది ఇచట యింకా ప్రజాప్రభుత్వం ఏర్పడలేదు. నాజీ అనుకూలురైన మానర్‌హీమ్ యింకా అధికారంలోవున్నారు. అందుకే సంధిషరతులలో సోవియట్ ప్రభుత్వం తమ దేశ రక్షణకు అవసరమైన రక్షణకేంద్రాలను అప్పగించాలని కోరింది. ఫిన్లాండు అఘాతానికి ముందువరంలోవున్న 'పోర్కాలా' ద్వీపకల్పం కౌలుకు పుచ్చుకుంది. ఉత్తరానవున్న సముద్రపురేవు పెట్సామోను స్వాధీనం చేయాలంది.

ఇవిరెండూ సోవియట్ఆత్మరక్షణకు ఎలా అవసరమోచూదాం. సోవియట్ ముఖ్యనౌకాకేంద్రం 'క్రాంస్టాట్', లెనిన్‌గ్రాడ్‌నగరం ఫిన్లాండు అఖాతంలో వున్నాయి. వీటికి రక్షణ వుండాలంటేనూ, సోవియట్ నౌకలు స్వేచ్ఛగా బాల్టిక్ సముద్రంలోకి వెళ్లాలంటేనూ, ఈఅఖాతంయొక్క ముఖద్వారం సోవియట్‌చేతుల్లో వుండాలి. అందుకే సోవియట్ 'పోర్కాలా' ద్వీపకల్పం అద్దెకు పుచ్చుకొంది.

ఇక 'పెట్సామో' రేవువిషయం. ఈకాలంలో మందుగుండు [illegible] యూరోపియన్ రష్యాకు ఒక రేవు [illegible] మర్మాన్‌స్కు రేవు. దాని [illegible] 'పెట్సామో' రేవు వుంది. ఫిన్లాండు [illegible] కాలంలో పడవేసే రేవు యిదొకటే. [illegible] వల్లనే 1940 సంధిలో యీరేవును [illegible] మని సోవియటు పట్టుబట్టలేదు. కాని [illegible] లో ఫాసిస్టు అనుకూలుర ప్రభుత్వం [illegible] పుడు యిది ఎంత ప్రమాదానికి దారితీసిం[illegible] తరువాత చరిత్ర రుజువుచేసింది. ఫి[illegible] ప్రభుత్వం 1940 సంధిషరతులను త్రో[illegible] జర్మనీతోచేరింది. జర్మన్ జలాంత[illegible] (సబ్‌మెరైన్లు) 'పెట్సామో' రేవులో[illegible] మిత్రరాజ్యాలనుండి సోవియటుకు [illegible] రవాణాలపై దెబ్బతీశాయి. ఎంతోనష్ట[illegible] గించాయి. అందుచే, మానరహీ[illegible] నిరంకుశులు, సోవియట్ విరోధులు [illegible] నరో వుండగా 'పెట్సామో' రేవును [illegible] యట్‌కు స్వాధీనం చేయమనడంలో ఆశ్చ[illegible] లేదు. అది సోవియట్ ఆత్మరక్షణకు అ[illegible] వరం. అందుకే సంధిషరతులలో సోవియట్ దానిని చేర్చింది.

— మద్దుకూరి చంద్రశేఖరరావు

★

దేవుడు వరమిచ్చినా పూజారి -

"తక్కావీ" అప్పులకు స్థానికాధికారుల ఆటంకాలు

●

1943 వ సంవత్సరంలో చీపురుపల్లి తాలూకాలో (విశాఖజిల్లా) ప్రళయమారుతంతో చెలరేగిన తుపానువల్ల 21094 కుటుంబాలు నష్టపడ్డాయనీ, దేనివల్లనైతేనేమి మొత్తం 7 లక్షల రూపాయిల నష్టం వాటిల్లిందనీ, ప్రభుత్వలెక్కలనుబట్టి తేలింది. నష్టపరిహారం క్రింద, రైతుల అధికోత్పత్తి సహాయార్థం, ప్రభుత్వం "తక్కావీ" అప్పులద్వారా 30 వేల రూపాయిలు, వ్యవసాయశాఖద్వారా 50 వేల రూపాయిలు, అప్పులీయదలచింది. కానిపై అధికారుల సమక్షంలో "తక్కావీ" అప్పులిస్తామని అంగీకరించిన స్థానికోద్యోగులు, రైతులు పెట్టుకున్న అర్జీలపై అప్పులివ్వక తమ కేమీ సంబంధంలేదని తప్పుకొనడం మామూలయింది. రైతులు యీవిధంగా ఆశాభంగం చెందుతున్నారు. వ్యవసాయ శాఖవారు గూడా తమ వాగ్దానం చెల్లించు కొనక, ససేమిరా అని మొండి పట్టుదల పట్టారు. స్థానిక రైతుసంఘం రైతుల చేత అప్పుదరఖాస్తులు దాఖలుచేయించింది. కాని ఆ అప్పులు మంజూరుకాలేదు. రైతులకు వ్యవసాయ తరుణం అనగా వరి విత్తనాలు చల్లుట, వేరుసెనగ మదుపులు మొదలైన పనులు గడచిపోయినవి. అప్పులు దొరుకుతాయనే ఆశతో యెదురుచూసి చూసి, విసుగుపుట్టి, రైతులు షావుకార్ల నాశ్రయించాలసొచ్చింది. అవకాశం కొరకు యెదురు చూస్తున్న షావుకార్లు 2 మాసాల గడువులో రు. 75 లుయిచ్చి రు. 100 లు యిచ్చినట్టు వ్రాయించుకున్నారు. ఆ అప్పుకూడా వేరుసెనగకాయలపైనే. లేకపోతే అసలు అప్పే [illegible] నిరాకరించారుషావుకార్లు. తరువుమందియుతవడాలంటే వేరుసెనగ పంటను తగ్గించుకోమని జిల్లా అధికార్లు ఒక వంక చెబుతో యిస్తుంటే, స్థానిక డిమాన్‌స్ట్రేటర్ కృషి దీనికి వ్యతిరేకంగా పరిణమించిందనటంలో సందేహంలేదు. ప్రక్క తాలూకాలో 40 వేల రూపాయలవరకు అప్పులీయబడ్డాయి. ఈ తాలూకాలో రు. 50 వేలకు రు. 7 వేలు మాత్రమే యివ్వనున్నారని వార్త.

పైగా ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా, ఒకే వాయిదాపైన అప్పులు చెల్లించు షరతు మీదనే అప్పులీయబడతాయని డిమాన్‌స్ట్రేటరుగారి ఆజ్ఞ. ఈ ఆజ్ఞను ఖండిస్తూ ప్రజలు ప్రభుత్వమునకు అర్జీలు పంపుతున్నారు. నిర్ణయించుకున్న అప్పులు తక్షణమే అందచేయాలనీ, తిరిగి అప్పులు రెండు వాయిదాలమీద చెల్లించే అవకాశమివ్వాలనీ, షావుకార్ల వితంకువానికి గురిచేయవద్దనీ, అధికోత్పత్తికి సహాయపడటం అత్యవసరమనీ, ఆ పిటీషన్ యొక్క సారాంశం. ఇంతవరకు రైతుల కోర్కెలు తీరలేదు. స్థానికాధికారులు, ప్రభుత్వం రైతుల యిబ్బందులను గుర్తించి, వారి కోర్కెలను తక్షణమే పాటించకపోతే, పంటలఉత్పత్తి కుంటుపడి, వచ్చేసంవత్సరం కూడా కరువువచ్చి ప్రజలను వేధించుకుంటుంది. ప్రభుత్వం వెంటనే జోక్యంపుచ్చుకొని స్థానికాధికార్ల అక్రమాలనుఅరికట్టవలసియుంది.

బస్తర్ సంస్థానంలో ఆంధ్రుల స్థితిగతులు

తెలుగువారికి మాతృభాషలోనే విద్యగరపాలి

బస్తరుస్టేటు విశాలమైన స్వదేశీసంస్థానం. నిజాంసంస్థానంలో తెలుగుప్రాంతమైన కరీంనగర్ జిల్లాను అనుకుని తూర్పుగా వుంది. ఇటు తూర్పుగోదావరిజిల్లాలోని భద్రాచలంతాలూకాను అనుకుని ఉత్తరంగావుంది. 13000 చదరపుమైళ్ళ వైశాల్యం వుంటుంది. జనాభాసుమారు 10లక్షలు. ప్రజలలోనూటికి 75 మంది అనాగరిక తెగలకుచెందిన ఆదిమ నివాసులు. వారు "గోండ్లి" "హాల్బి" వగైరా లిపిలేని భాషలను మాట్లాడుతూవుంటారు. వీరి ఆచార వ్యవహారాలను, భాషను ఫాదర్ "ఎల్విన్" పరిశీలించారు. ఇక్కడి ప్రజలు ఆదిమ, ద్రావిడ సాంప్రదాయాలకు చెందినవారని ఆయన వ్రాశారు. వీరి భాషలలో అనేక ద్రావిడ పదాలున్నాయి. అందుచే తెలుగు లిపిని ఉపయోగించి, యీభాషలలో పాఠ్యపుస్తకాలువ్రాసి, యీప్రజలకు చదువు చెప్పాలని వుంటుందని ఫాదర్ 'ఎల్విన్' సూచించారు.

బస్తరు సంస్థానం తెలుగుప్రాంతాలను అనుకొని వుందని పైన తెలియజేశాను. అలా అనుకొనివున్న ప్రాంతాలలో ప్రజల మాతృభాష తెలుగు. తెలుగు మాట్లాడే ప్రజలు సుమారు 3000 చదరపుమైళ్ల వైశాల్యంలో జీవిస్తున్నారు.

విద్యావిధానం

బస్తరు సంస్థానం మధ్యరాష్ట్రాల ప్రభుత్వంక్రింద వుంది. అచట మాతృభాషగా హిందీ వాడబడుతూంది. ఆ హిందీయే బస్తరు సంస్థానంలోకూడ రాజభాష - కోర్టు భాషగా వాడబడుతూంది.

అంతటితో ఆగితే నయమే. బస్తరు ప్రజలలో ఎవరికీ హిందీ మాతృభాషకాదు. అయినప్పటికీ, ప్రభుత్వం హిందీనే ప్రజలపై రుద్దుతోంది. 13 వేల చదరపుమైళ్ళకు ఆ సంస్థానంలో 40 ప్రాథమిక పాఠశాలలు మాత్రంవున్నాయి వాటి అన్నిటిలోనుబోధించేది ప్రజల మాతృభాషలు కావు. హిందీ చెబుతారు. తెలుగుప్రాంతంలోవున్న పాఠశాలల్లో కూడ అంతే. ఆపాఠశాలల్లో మాస్టర్లు హిందీవారు. అందుచే మాస్టర్లు చెప్పేది పిల్లలకి తెలియదు. పిల్లలు మాట్లాడేవి పూర్తిగా మాస్టరుకి తెలియదు. అలాంటప్పుడు ప్రజలు తమపిల్లలను బళ్ళలోకి పంపరంటే ఆశ్చర్యం యేముంది? ఒక కొంత పాఠశాలలలోమాత్రం కొన్నిఏండ్లక్రితం తెలుగు మాస్టరునువేశారు.

1942 - 43లో శ్రీరాధాకృష్ణన్ బి. సి. యస్. గారు సంస్థాన ఎడ్మినిస్ట్రేటరుగా వచ్చారు. వారు కమానువెళ్ళినపుడు తెలుగు బస్తరులో ఒకస్కూలుకివెళ్లి చూశారు. రిజిస్టరులో చాలపేర్లు వున్నాయి. కాని హాజరయినవారు తక్కువ. ఆయన మాస్టర్ని సంజాయిషీ అడిగారు. మాస్టరు తానెంత ప్రయత్నించినా పిల్లలు స్కూలుకు రావడం లేదన్నాడు. గ్రామస్థుల్ని పిలిపించి అడిగారు. చదువు తమ మాతృభాషలో చెప్పనందున పిల్లలకేమీ బోధపడటం లేదన్నారు వాళ్లు. వచ్చిన కొద్దిపాటిచదువు కూడ పిల్లలకు ముందు జీవితంలో ఉపయోగపడటం లేదని మనవిచేసికొన్నారు.

ఈ విధమైన ఘటనలే ఇతరచోట్ల కూడ జరిగాయి. అపుడు రాధాకృష్ణగారు డిప్యూటీ ఇన్‌స్పెక్టరు ఆఫ్‌స్కూల్సును పిలిపించి, తెలుగు - బస్తరులో తెలుగులోనే ఎందుకు చదువు చెప్పడంలేదని సంజాయిషీ అడిగారు. స్కూళ్ళ ఇన్‌స్పెక్టరు తనకు తెలుగు రాదనియు, తెలుగు మాస్టర్లను నియమించితే ఆస్కూళ్ల పరీక్షచేయడానికి వీలుండదనియు, అందుచే తెలుగులో చెప్పడంలేదని అన్నాడు.

విద్యా విధానంలోవున్న యీ లోట్లను, ప్రజలుపడుతున్న యిబ్బందులను శ్రీ రాధాకృష్ణన్‌గారు గమనించారు. బస్తరు విద్యావిధానాన్ని సంస్కరించడానికి ఒకస్కీమును తయారుచేశారు. దానిని పొలిటికల్ డిపార్టుమెంటు ఆమోదంకొరకు పంపారు. మాస్టర్ల, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ల, జీతాలు హెచ్చింపు విషయంతప్ప ఆ స్కీము అంతా శాంక్షను అయి వచ్చింది. కాని యింతలో శ్రీ రాధాకృష్ణన్‌గారు బదిలీఅయ్యారు.

రాధాకృష్ణన్ స్కీము

ఈ స్కీము ప్రకారం స్కూలు బిల్డింగులు విశాలమైనవిగాను, గాలి - వెలుతురు వచ్చేవిగానూ, వుండాలి. క్లాసుకు ఒక గది చొప్పున వుండాలి. క్లాసుకు ఒక మాస్టరు వుండాలి. మధ్యాహ్నం స్కూలు పిల్లలకు భోజనం ఉచితంగా పెట్టాలి.

బోధించే విషయాలను నిర్ణయించడంలో యితరరాష్ట్రాలను గ్రుడ్డిగా అనుసరించరాదు. అచటి పరిస్థితులకు అనుగుణ్యంగా సిలబస్ తయారుచేయాలి. పెద్దగ్రామాలలో గ్రామస్థుల్ని ఒప్పించి, నిర్బంధ ప్రాథమికవిద్య ప్రవేశపెట్టాలి.

బడిపిల్లలకు తరుచుగా వైద్యపరీక్ష చేయించాలి. పల్లెటూరి స్కూళ్ళలో జ్వరం, తలనొప్పి వగైరా జబ్బులకు చికిత్స, సాధారణ మందులు ఉపయోగించే పద్ధతులు మాస్టర్లకు నేర్పాలి. హెడ్మాష్టరు పూచీక్రింద మందులు వుంచాలి. తెలుగు బస్తరులో ప్రైమరీ విద్య తెలుగులోనే చెప్పాలి. చివరిక్లాసులో మాత్రం హిందీతప్పనిసరిగా వుంటుంది.

ఈస్కీము ప్రకారం మాస్టర్ల జీతాలు యిలా వుంటాయి (ట్రెయిన్డ్ మాస్టరు అయితే రు. 25-2-45 చొప్పున. (అంటే 25 రూపాయలనుండి, సంవత్సరానికి రు. 2 చొప్పున హెచ్చింపుతో 45 రూ॥ల వరకు) స్కేలు వుంటుంది. సెకండరీగ్రేడ్ ట్రెయినింగ్ పొందిన హెడ్‌మాస్టర్ల స్కేలు రు 40-2-60 వుంటుంది. కాని యీజీతాల స్కేలు యింకా శాంక్షనుఅయినాలేదు. ఇపుడింకా పాత స్కేళ్లే వున్నాయి. ట్రెయిన్డ్ మాస్టర్ల స్కేలు రు. 15-1-20. ట్రెయిన్డ్ గాకపోతే రు. 12-½-15 స్కేలువుంది. ఇదిగాక నెలకు 3 రూపాయల కరువుభత్యం యిస్తున్నారు.

ఈస్కీము ప్రకారం తెలుగు బస్తరుకు ఒక తెలుగుతెలిసిన డిప్యూటీ ఇన్‌స్పెక్టర్‌ను నియమించాలి. వారి జీతం స్కేలు రు 70-5-120 వుంటుంది. కాని యిదికూడ యింకా శాంక్షను కాలేదు. పాతస్కేలు రు. 60-5-80 అమలులో వుంది.

జీతాల స్కేళ్ల తప్ప పైస్కీము అంతా శాంక్షను అయింది. కాని అమలులో పెట్టడములో యింకా ఆలస్యం జరుగుతోంది.

ఇంతవరకు తెలుగు డిప్యూటీ ఇన్‌స్పెక్టరును నియమించలేదు. తెలుగు మాష్టర్లనుకూడ నియమించలేదు. అపుడే యీసంవత్సరంలో మూడునెలలు గడిచిపోయాయి. పాతస్కేళ్ళ ప్రకారం మాష్టర్లు దొరకరని అధికారులు సాకుచెబుతున్నారు. కొత్తస్కేళ్లు శాంక్షను అయ్యాక చూస్తామంటున్నారు.

ఆంధ్రాభిమానుల కర్తవ్యం

బస్తరులోవున్న తెలుగుప్రజలు ఎంతో వెనుకబడివున్నారు. రాధాకృష్ణన్ స్కీమును అమలు జరిపితే, బస్తరు ఆంధ్రుల అభ్యుదయానికి చక్కని అవకాశం లభించుతుంది. మాతృభాషలో చదువు చెప్పబడుతుంది.

అందుచే బస్తరు సోదరులకంటే విద్యావిజ్ఞానంలో ఔన్నత్యంలోవున్న ఆంధ్రులు దేశభక్తితో పైస్కీమును అమలు జరుపడానికి సాయపడాలి. ఉపాధ్యాయులుగా పని చేయ సంసిద్ధతను తెలుపుతూ దరఖాస్తులు పంపాలి. అలాచేస్తే తెలుగుమాష్టర్లుదొరకడం లేదని సాకు చెప్పడానికి అధికార్లకు అవకాశం వుండదు. అలా తెలుగుమాష్టర్లు చొరవతో ముందుకువస్తే, కొత్తస్కేలు ప్రకారం జీతాలు శాంక్షను చేయించుకోవచ్చును. సోదర ప్రజలకు మాతృభాషలో చదువుచెప్పి, వివిధ ప్రాంతాల తెలుగుప్రజల మధ్య జాతీయాభిమానం కలిగించడం ప్రజాసేవకుల కర్తవ్యం.

ఇందుకు సిద్ధమయ్యేవారు తెలుగులోను యింగ్లీషులోను క్రింది అధికారికి దరఖాస్తులు పంపుకోవాలి.

"Home and Judicial Member,"
Bastar State
Post Jagdalpur

— "ఒక అభిమాని"

రైతుఉద్యమ సర్వతోముఖాభివృద్ధి

రాష్ట్రరైతుసంఘ తీర్మానాలు

ఆంధ్రరాష్ట్ర రైతుసంఘ కార్యనిర్వాహక వర్గమువారు సెప్టెంబరు నెల 24, 25 తేదీలలో, బెజవాడయందలి సంఘ కార్యాలయంలో శ్రీ కడియాల గోపాలరావుగారి అధ్యక్షతక్రింద సమావేశమై, ఈనాడురైతుల నెదుర్కొన్న అనేక సమస్యలపై తీర్మానములు గావించారు.

మొదట, సంఘ ప్రధాన కార్యదర్శి శ్రీ నందూరి ప్రసాదరావుగారు జులై 2 వ తేదీనుండి ఈనాటివరకూ జరిగిన సంఘ కృషిని వివరించారు. గాంధీ—జిన్నా సంప్రదింపులు జయప్రదం కావాలంటూ ఆగస్టు ప్రథమంలో జరిపిన "ఐక్యతావారం" 830 గ్రామాలలోనూ, సెప్టెంబరు 1వ తేదీ "రైతు దినోత్సవం" 148 గ్రామాలలోనూ జరిగినవన్నారు. రైతులకు రు. 9,86,218-0-0 ల ఎరువులనూ, 4 వేల బస్తాల విత్తనాలను, 50 టన్నుల బరువుగల పలుగులూ, పారలూ, అందజేయగలిగామని చెప్పారు. కృష్ణకాల్వల మరమ్మతు ఫలితంగా యింతవరకూ 10 వేల యకరాలు ఆయకట్టులో చేర్చబడిందనీ; ఆహారోత్పత్తికై రాష్ట్రంలోఅనేకచోట్లరైతులే ముందుకొచ్చి, చెరువులు - కాలువలు మరమ్మతులు చేసుకుంటున్నారనీ చెప్పారు. ధాన్యందర మిల్లువద్ద రు. 11-6-0 లు ఇవ్వాలనీ, విశాఖజిల్లాలో చెరకు పండించే రైతులకు కలిగిన నష్టానికి పరిహారం యివ్వాలనీ, ఎడతెగని ఆందోళన జరుగుతోందన్నారు. సంఘకృషి ఫలితంగానే ప్రభుత్వం ఈనాం రైతులబిల్లును తెచ్చిందనీ, దానికి సంఘం సూచించిన సవరణలు ఆమోదించబడేటట్లు కృషిచేయవలసి వుందనీ చెప్పారు. పైన వివరించబడిన కృషి ఫలితంగా ఈ 3 మాసములలోనూ 30,350 మంది సభ్యులు సంఘములో చేరారనీ, దీంతో సంఘ సభ్యత్వం 1,31,357 కు పెరిగినదనీ, 11 జిల్లాలలోనూ 49 తాలూకా సంఘాలు బాగా కృషిచేస్తున్నాయనీ, అయినప్పటికీ ఈనాడు రైతాంగము నెదుర్కొన్న సమస్యలను జయప్రదంగా పరిష్కరించాలంటే ఐక్య రైతుఉద్యమాన్ని నిర్మించాలనీ, చెప్పి ముగించారు.

తరువాత సుప్రసిద్ధ కాంగ్రెసునాయకులైన దండు నారాయణరాజుగారి అకాల మరణానికి సంతాపాన్ని వెలిబుచ్చుతూ తీర్మానించబడింది. తరువాత, ఐక్యరైతుఉద్యమముపై యీక్రింది విధంగా తీర్మానించారు:

యూరపులంతంతో ప్రజలే ముందుకు వచ్చి ప్రజా ప్రభుత్వాలు యేర్పాటు చేసుకుంటున్నారు. మనదేశంలో హిందూ-ముస్లిం ఐక్యతద్వారా స్వాతంత్ర్యాన్ని సంపాదించేటందుకు గాంధీ - జిన్నాలు కృషిచేస్తున్నారు. ఈ ప్రయత్నాలను సఫలపరచడానికి, కరువు కాటకాల బారినుండి ప్రజలను రక్షించడానికి, రైతుల హక్కులను సంపాదించడానికి, ఐక్య రైతు ఉద్యమాన్ని నిర్మించుటకు ముందుకు రావలసినదిగా "ఆంధ్రరాష్ట్ర రైతుకాంగ్రెసు" వారికి యీసభవారు విజ్ఞప్తి చేస్తున్నారు.

తరువాత, రైతులు తమవద్దనున్న మిగులు ధాన్యాన్ని వెంటనేఅమ్మి, కరువుబారిబడకుండా ప్రజలనురక్షించవలసినదిగారైతులకు విజ్ఞప్తి చేయబడింది. ఆ తరువాత ఆహారసమస్యా పరిష్కారానికై ప్రభుత్వం యీదిగువ సూచించిన కోర్కెలను నెరవేర్చాలని ఏకగ్రీవంగా తీర్మానించారు.

1. ధాన్యందర బస్తా 1కి మిల్లు వద్ద రు. 11-6-0 లుగా నిర్ణయించాలి.

2. వివిధ జిల్లాలలోని తరుగుప్రాంతాలకు సప్లయిచేసే బాధ్యత కలెక్టర్లమీదా, ఎగుమతుల బాధ్యత "గ్రెయిన్‌పర్చేజింగ్ ఆఫీసర్ల" మీదా పెట్టడంవల్లధాన్య సేకరణవిధానానికి చాలా ప్రతిబంధకాలు కలుగుతున్నాయి. కాబట్టి జిల్లాలోని తరుగుప్రాంతాల సప్లయిబాధ్యతా, దిగుమతుల బాధ్యతా రెండుకూడా "గ్రెయిన్‌పర్చేజింగ్ ఆఫీసర్ల"మీదనే వుండాలి.

3. తూర్పుగోదావరిజిల్లాలోని వేలకొలది టన్నుల మిగులు ధాన్యాన్ని వెంటనే సేకరించి, విశాఖకు ఎగుమతిచేయాలి.

4. జొన్నలు మొదలైన యితర ధాన్యాలకుకూడా ధరలు నిర్ణయించి, వాటి సేకరణ కూడా చురుకుగా సాగాలి.

5. 1944 సం॥పు ధాన్యసేకరణ ఆర్డరును అందులోవున్న లోట్లను యీ సంఘం సూచించిన విధంగా సవరించి, వెంటనే రాష్ట్రమంతటకూ వర్తింపచేయాలి

ఇవిగాక ఎరువులూ, విత్తనాలూ, వ్యవసాయపనిముట్లూ, విరివిగా రైతుల కందజేయాలనీ, గన్నవరం అక్విడెక్టును వెంటనే నిర్మించాలనీ, పాడైపంటలకు ప్రతిఫలం యివ్వాలనీ, పత్తిని ప్రభుత్వమే కొనాలనీ, ప్రాజెక్టులను నిర్మించాలనీ, మొదలగు తీర్మానములు చాలా చేయబడ్డాయి.

ప్రథమ గుంటూరు పట్టణ కార్మిక మహాసభ

★

అపూర్వ చైతన్యంతో కార్మికవర్గం ముందంజ వేస్తోంది

గుంటూరు పట్టణ కార్మికోద్యమంలో ఇది నూతనఘట్టం. అవాంతరాలు గడచి కార్మికోద్యమం నేడు పట్టణమంతా వ్యాపించింది. వివిధవృత్తులలో పనిచేసే కార్మికులు తమతమ సంఘాలు పెట్టుకొని బలపడ్డారు. ఎవరిచోట వారిదేగాకుండా, ఉమ్మడి కష్టాలను సమిష్టి ప్రయత్నాలద్వారా పోగొట్టుకొన దలిచారు. ఇందుకోసమే ప్రథమ పట్టణ కార్మిక మహాసభ సెప్టెంబరు 17 వ తేదీన జరిగింది. ఈ సభలోనే సిటీ ట్రేడ్‌యూనియన్ కౌన్సిల్ ఏర్పడింది.

ఇలాంటి మహాసభకు పెద్దల ఆశీర్వచనాలు లభించకుండా ఎలాగుంటాయి? అఖిల భారత ట్రేడ్‌యూనియన్ కాంగ్రెస్, జిల్లా కాంగ్రెస్ నాయకులు వేది చలపతిరావుగారు, జిల్లా ముస్లింలీగ్ ఆర్గనైజింగ్‌కమిటీ కార్యదర్శి జనాబ్ మహబూబ్, జిల్లాకమ్యూనిస్టు కమిటీ కార్యదర్శి, సందేశాలంపజేశారు. కాకినాడ, చీరాల, తెనాలి, బాపట్లనుండి సోదర కార్మికసంఘాలు తమ సుహృద్భావ సందేశాలందజేశాయి.

మహాసభకు వచ్చిన ప్రతినిధులు చెప్పిన విషయాలు వింటూంటే, యుద్ధానికి పూర్వం కార్మికుల స్థితిగతులకు, నేటి స్థితిగతులకు ఎంత తారతమ్యం వుందో స్పష్టంగా బోధపడింది.

యజమానుల దురాశలకు, వడ్డీవ్యాపారుల దురాగతాలకు, అధికారుల దబాయింపులకూ కార్మికులు బలిఅయ్యేవారు. పై పెచ్చు నీచంగా చూడబడేవారు. ఇక మునిసిపల్ కార్మికుల విషయం మరీఘోరం. పైచెప్పిన కష్టాలకు తోడు తగాయిదాలు, కులతప్పులు, త్రాగుడు తందనాలు మొదలగు దురాచారాలకు గురిమైఉండేవారు.

కాని నాటికి నేటికి పోలికేలేదు. గుంటూరు పట్టణ కార్మికసంఘాలలోకెల్లా తలమానికం లాగుడుబళ్ళవారి కార్మికసంఘం. ఆగస్టు అల్లరులలో కొందరు విధ్వంస చర్యలకుప్రోత్సహించినా, వీరావసులకు పూనుకోలేదు. లూటీలకు ప్రేరేపించిన వారిని మందలించారు. దొంగమార్కెటును అరికట్టడంలోనూ, బియ్యాన్ని కంట్రోలుధరకు అమ్మించటంలోను, రేషనింగు జయప్రదం చేయుటలోను కృషిచేసి ప్రజల మన్ననలను పడశారు. కరువుపన్ను అంటూ షావుకార్లు వసూలుచేసిన ప్రజలధనం, వాళ్ల ఇనప పెట్టెల్లో మూల్గుతుంటే, దాన్ని బయటకు తెప్పించారు. ఆదబ్బుతో చౌకడిపోలు పెట్టించి బీదలను కాపాడేటట్లు చేసింది వారిబలమే. సుశిక్షితులైన 30 మంది వలంటీర్లు ప్రజాసేవకు నిత్యం సిద్ధమవుతారు. రైతుమహాసభకు, రాష్ట్రవిద్యార్థి మహాసభకు వలంటీర్లుగా పనిచేశారు. అధికోత్పత్తికి తోడ్పడే కృష్ణకాలవ మరమ్మతులో పాల్గొని రైతాంగం యొక్క ప్రశంసల పొందారు. తక్కిన సంఘాలకు చేయూతనిస్తూ లాగుడుబండ్ల కార్మికుల సంఘం పట్టణంలో గౌరవస్థానం ఆక్రమించింది.

ఇక మునిసిపల్ కార్మికుల విషయం. ప్రజల ఆరోగ్యం బాగుపరిచేందుకు తీవ్రంగా కృషి చేయుటద్వారానే, తమ కోర్కెలకు ప్రజల మద్దతు ఉంటుందని వీరు గ్రహించారు. సాంఘికదురాచారాలు నానాటికి క్షీణించుచున్నాయి. అధికారుల అన్యాయాలు కట్టుబడ్డాయి. ప్రజలసాయంతో విజయపరంపరలు పొందుతున్నారు. ఈరెండు సంఘాలు ఇతర కార్మిక సంఘాలకు ప్రోత్సాహమిచ్చాయి.

"1940లో నామకః ఏర్పడిన మాసంఘం నడిపే నాథులు లేక మూలబడ్డది. మీ నాయకత్వం దొరికింది. ముందంజ వేయగలమనే నమ్మకం చిక్కింది" అంటూ కమ్యూనిస్టుల నుద్దేశించి, తాపీపనివారల సంఘాధ్యక్షుడు పలికాడు.

40 ఏండ్లనుండి జీతబత్తేలలో హెచ్చింపు ఎరుగని ఫ్యాక్టరీ కార్మికులు రూపాయికి పావలా చొప్పున అదనపుజీతం, 100 కి 20 చొప్పున యుద్ధపుబత్తెం, సంఘబలంతోసంపాదించారు. యజమానుల దౌర్జన్యాలఫలితంగా దినదినగండం గడిపే జూట్‌మిల్లు కార్మికులు కూడ సంఘం ఏర్పరచుకొన్నారు. ప్రెస్ వర్కర్లలో తిరిగి ఉత్సాహం ప్రబలింది. పేపరుకంట్రోల్ ఆర్డర్‌లో కొన్ని లోపాలను సవరించాలని ఆందోళనచేసి విద్యావంతుల, యజమానుల, అభిమానం చూరగొన్నారు, 3 రూపాయల అదనపుజీతం సంపాదించారు.

ఇన్ని సంఘాలిలా పనిచేస్తుంటే, షావుకారు గుమాస్తాలలోకూడ కదలిక వచ్చింది. లాగుడుబండ్లకార్మికులు, ఫ్యాక్టరీకార్మికులు అమావాస్యకు సెలవు సంపాదించడంచూచి, తాము సంఘబలంద్వారా ఆ సెలవును సంపాదించారు. పౌంట్రీవర్కర్సు, టైలర్సుకూడ తమ సంఘాలను పెట్టుకొన్నారు. ఇవీ పట్టణ కార్మికోద్యమపు ప్రస్తుత పరిస్థితులు.

మనరాష్ట్రంలో అన్నమాటేమిటి — దేశమంతటా, ప్రపంచమంతటా చైతన్యంతో కార్మికులు ముందంజ వేస్తుంటే, మనవాళ్ళు వెనుకబడేది?

ప్రతినిధులు సమగ్రంగా చర్చించి యీ క్రింది తీర్మానాలు గావించారు.

కార్మిక నాయకులైన రామలింగయ్య, వీరభద్రం (విశాఖపట్టణము) మొదలగువారిని వెంటనే విడుదల చేయాలన్నారు. ఊరేగింపుకు అనుమతి ఈయని ప్రభుత్వచర్యను ఖండించారు.

ముఖ్యమైన తీర్మానం. తమ వృత్తుల కనుగుణ్యంగా అధికోత్పత్తి తీర్మానాన్ని అన్వయపరచి పనిచేయాలన్నారు. ఇంకా తమహక్కులను బలపరచవలెనని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. న్యాయమైన కోర్కెలను అంగీకరించవలసిందని యజమానులను, అధికారులను కోరారు. రేషనింగు జయప్రదం చేయడానికి బఫర్‌స్టాకులు విల్వ లేర్పరచాలని ప్రభుత్వాన్ని కోరారు.

తర్వాత సిటీ ట్రేడ్‌యూనియన్ కౌన్సిల్ ఏర్పడింది. వివిధ సంఘాలకు ప్రాతినిధ్యం వహించే కార్యనిర్వాహకవర్గం ఎన్నుకోబడింది.

సాయంత్రం ఆరుగంటలకు పార్కులో బహిరంగసభ. 3 వేల స్త్రీ పురుష కార్మికులతో, తదితర ప్రేక్షకులతో కన్నుల పండువుగావుంది. వావిలాల గోపాలకృష్ణయ్యగారు ఎర్రజండా ఎగురవేశారు. పిల్లలమర్రి వెంకటేశ్వర్లుగారు, పి. వి. శివయ్యగారు, నేటిపరిస్థితులలో కార్మికుల, ప్రజల, కర్తవ్యాన్ని విశదపరచారు. వైజ్ఞానిక ప్రదర్శనల అనంతరం, ఉత్సాహంతో కార్మికులు తమ యిండ్లకు వెళ్లారు.

★

కార్మికనాయకులకు కఠిన శిక్ష

తమ కష్టాలను జిల్లా కలెక్టరుకు నివేదించుకోడానికి జూన్ 1వ తేదీన చిట్టివలస కార్మికులు బయలుదేరుతుండగా, వారి నాయకులైన కామ్రేడ్స్ వీరభద్రం, జోగారావు, అప్పలస్వామిగార్లను పోలీసులు అరెస్టు చేశారు. (కామ్రేడ్ భద్రం 1943 మార్చినుండి 1944 మే వరకు డిటెన్షన్‌లో వుంచబడి, అప్పుడే బయటికి వచ్చారు.) విశాఖపట్టణ హార్బర్ కార్మికసంఘాధ్యక్షుడు విజయకుమార్‌నూ, ఆంధ్రరాష్ట్ర కమ్యూనిస్టుకమిటీ రాష్ట్ర ఆర్గనైజర్ జొన్నలగడ్డ రామలింగయ్యగారినికూడా విశాఖపట్టణంలో అరెస్టుచేశారు. ఇంకో 7 గురినికూడా అరెస్టుచేశారు. సెప్టెంబరు 18వ తేదీన విజయనగరం జాయింట్ మేజస్ట్రేటుగారు దేశరక్షణ చట్టంక్రింద, రామలింగయ్య, విజయకుమార్, వీరభద్రంగార్లకు సంవత్సరం కఠినశిక్ష విధించారు. తక్కిన వారిని విడుదల చేశారు.

మేజిస్ట్రేట్‌గారు తమతీర్పులో, నిందితులు ఫాసిస్టు ప్రతికూలురేననీ, యుద్ధోన్ముఖులేననీ, కార్మికులను సమ్మెకు పురికొల్పలేదనీ గుర్తించారు. కాని కదుటాకరం సుబ్బారావుగారి స్మారకదినోత్సవంలో వీరిచ్చిన ఉపన్యాసాలు వర్గస్పర్థకు దారి తీస్తాయని, తద్వారా యుద్ధకృషికి ఆటంకం గల్గుతుందనీ అన్నారు. ఇంతకంటె హాస్యాస్పదమైన విషయం ఉండబోదు. విశాఖపట్టణంవంటి కీలకస్థానంలో కార్మికులలో దేశభక్తిప్రబోధించి అధికోత్పత్తికి కృషి చేయుచున్న కార్మికనాయకులనిలా శిక్షించడం యుద్ధవిజయానికి ఎలా దారి తీస్తుందో దురూహ్యం.

చిలకమర్తి లక్ష్మీనరసింహంగారికి సన్మానం

★

మహాకవి, కళాప్రపూర్ణ శ్రీ చిలకమర్తి లక్ష్మీనరసింహంగారిని సన్మానించడానికి, సాహిత్యాభిమానుల, సంస్కారప్రియుల, దేశభక్తులసహాయంతో, గుంటూరు పట్టణ అభ్యుదయరచయితల సంఘం పూనుకొంది. సన్మానసంఘ కన్వీనింగుకమిటీఒకటి ఏర్పడింది.

మహాకవి, కళాప్రపూర్ణ శ్రీ చిలకమర్తి లక్ష్మీనరసింహంగారు ఆంధ్రభాషకు, తద్వారా ఆంధ్ర ప్రజలకు చేసినసేవ అపారమైంది. ఉత్తమ చారిత్రకనవలలను, తెలుగువారి నిత్యజీవితాన్ని ప్రతిబింబించే సాంఘిక నవలలను రచియించారు. దేశభక్తిని, ధైర్య సాహసాలను ప్రబోధించే కథలను రచించారు. ఆదర్శప్రాయమైన మహాపురుషుల జీవితాలను రచించారు. పండితుడి నుండి పసులకాపరివరకు వీరి నాటకాలలోని పద్యాలను ప్రతి ఆంధ్రుడూ కంఠస్థంచేశాడంటే, అవి ఎంత ప్రజాభిమానాన్ని చూరగొన్నవో వేరుగా చెప్పనక్కరలేదు. వీరేశలింగం పంతులుగారు ఆంధ్రవాఙ్మయంలో ప్రవేశపెట్టిన నూతనసాహిత్య రూపాలన్నిటినీ చిలకమర్తివారు సరికొత్త జీవంతో, సరికొత్తశక్తితో ప్రదర్శించారు.

పంతులుగారి సంస్కారోద్యమాన్ని, వారి పవిత్రాశయాలను సులభశైలిలో తమ సాహిత్యంద్వారా ప్రజల హృదయాల్లో పాదుకొల్పారు. రమారమి 10—12 సంవత్సరాలు "దేశమాత" పత్రికను నడిపారు. (ప్రభుత్వం ధరావతు కోరడంవల్ల ఈజాతీయ పత్రిక నిలిచిపోయింది.) పదిపన్నెండుసంవత్సరాలు. గాంధిగారి హరిజనోద్యమం రాక పూర్వమే హరిజనమాధ్యమిక విద్యాలయం స్థాపించి, ఉచిత విద్యాభోజనాది సౌకర్యాలు గావించి, హరిజనాభ్యుదయానికి తోడ్పడ్డారు.

ఇట్టి మహనీయుని 1944 నవంబరులో సన్మానించి రు. 1116 సమర్పించదలచిన సన్మానసంఘానికి అందరూ తోడ్పడప్రార్థన. సన్మాన సంఘానికివిరాళాలివ్వవలెనవిప్రార్థన.

సన్మానసంఘంలో ఈ క్రిందివారుచేరారు.

(1) శ్రీకొండా వెంకటప్పయ్య, (2) ఉ[illegible]టూరి వెంకటసుబ్బయ్య, (3) [illegible] వెంకట లక్ష్మీనరసింహారావు, (4) డాక్టర్ జి. వి. చౌదరి, (5) దివాకర్ల సత్య[illegible], (6) అన్నంరాజు సీతాపతిరావు, (7) ఉన్నవ గోపాలకృష్ణయ్య, (8) [illegible] రాజా పుండరీకాక్షుడు, (9) డాక్టర్ టి. చిదానందం, (10) డాక్టర్ ఆర్. పుండరీకాక్షుడు, (11) అంచా రంగారావు, (12) కూర్మా వేణుగోపాలస్వామి, (13) తెలికచర్ల వెంకటరత్నం, (14) మల్లంపల్లి సోమశేఖరశర్మ, (15) మారేమండ రామారావు, (16) వావిలాల సోమయాజులు, (17) ప్రత్తిపాటి అంకమ్మ చౌదరి, (18) కర్లపాలెం కృష్ణారావు, (19) దేవరాజు కృష్ణశర్మ, (20) మాధవపెద్ది సత్యనారాయణమూర్తి, (21) ప్రయాగ కోదండరామశాస్త్రి, (22) శ్రీమతి ఇందిరా వందనంగారలు.

ప్రముఖుల అభిప్రాయం

శ్రీ దిగవల్లి వెంకటశివరావుగారు:-

"......బ్రహ్మశ్రీ చిలకమర్తి లక్ష్మీనరసింహం పంతులుగారిని సన్మానించడానికి తలపెట్టినందుకు చాలా సంతోషిస్తున్నాను"

శ్రీ తుమ్మల సీతారామమూర్తి చౌదరిగారు:

"....మీరు పూనిన పని ప్రశంస్యము. మహాకవులు, కళాప్రపూర్ణులు నయ్యు లేమిడి వ్రేగుచే క్రుంగిపోవుచున్న శ్రీ లక్ష్మీనరసింహకవిగారికి, ఈ ముదుసలికి, కడపు కాలమున వేయాఱులతో సత్కారము జరుపనున్న మీసంఘము భాషా సేవకుల కొజ్జబంతి నాదగు"

ఉత్తర ప్రత్యుత్తరాలకు:
ప్రయాగ కోదండరామశాస్త్రి.
కార్యదర్శి కన్వీనింగ్‌కమిటీ.
శ్రీ చిలకమర్తి సన్మానసంఘం,
కొత్తపేట, గుంటూరు. [illegible]

ప్రజాబలంముందు దొంగ వ్యాపారస్తుని ఓటమి

మంగళగిరి ఆహారకమిటీ కృషిఫలితం

ప్రజల్లో సంఘీభావం ఉంటే, నిలవ వ్యాపారస్తుల్ని సులభంగా లొంగదీయవచ్చు. స్థానికాధికారుల ఉపేక్షను వ్యక్తిచెప్పవచ్చు. కంట్రోలురేట్లకు ఆహారధాన్యాలు ప్రజలందరికి అందేలా చేయవచ్చు. ఆహారకమిటీల ద్వారా యీ సమస్యను చక్కగా పరిష్కరించుకోగలం.

మంగళగిరి ఉదంతం యిందుకు చక్కని ఉదాహరణ. అక్కడ డిప్యూటీ తహసిల్దారు బియ్యానికి, జొన్నలకూ, కంట్రోలు రేట్లు ప్రకటించాడు. (బియ్యం బస్తా రు. 24-4-0, జొన్నలు రు. 18-12-0) అంతకుమించి అదనంగా షావుకార్లెవరూ అమ్మకూడదని హెచ్చరించాడు. చుట్టువట్ల చాలా గ్రామాలు బియ్యానికి, జొన్నలకూ మంగళగిరిపై ఆధారపడియున్నాయి. ప్రతిగ్రామానికి డిప్యూటీ తహసిల్దారు కొందరు చిల్లరవర్తకులకు పెర్మిట్లు యిచ్చాడు.

బస్తా 32 రూపాయలు!

అయితే, మంగళగిరి షావుకార్లు తహసిల్దారు ఉత్తరువును ఖాతరు చేయలేదు. కంట్రోలు రేటుకు మించి రు. 3, 4 చొప్పున అదనంగా యిస్తేగాని పెర్మిటువార్లకు అమ్మేవారుకారు. ఈ అక్రమాన్నిగురించి పెర్మిటుదార్లు స్థానికోద్యోగులకు మొరపెట్టుకున్నారు. కాని ప్రయోజనం శూన్యం. ఇక గత్యంతరంలేక, అదనపురేట్లకే సరుకును కొని తెచ్చేవారు. నెత్తి మూటలపై చాల గ్రామాలకు సరుకు చేరాలి. అందువల్ల, బియ్యపు బస్తా ధర రు. 32 వరకూ పెరిగిపోయింది. ఇలాగే జొన్నల ధరకూడా పెరిగింది. పేదరైతులు, కూలీలు యీ విపరీతపు ధరలకు బియ్యంగాని, జొన్నలుగాని, కొనుక్కోలేకపోయారు. అనేకులు పస్తులుపడవలసి వచ్చింది.

ఆహారకమిటీ చొరవ

పరిస్థితులిలాగే కొనసాగితే, అనర్థం వాటిల్లుతుందని నేలపాడు ప్రజా ఆహారకమిటీ గుర్తించింది. 20-9-44 వ తేదీని 20 మంది కూలీలతోను, పెర్మిటుదారులతోను, కలిసి కమిటీ నాయకులు మంగళగిరివెళ్లారు. కంట్రోలురేటుకి జొన్నలు సప్లయి చేయవలసిందని ఒక షావుకారుని కోరారు. అతను బస్తా రు 21-4-0 రేటుకిగాని (అనగా కంట్రోలు రేటుకు మించి రు 2-8-0) యివ్వనన్నాడు. కంట్రోలురేటుకి కావాలంటే, మరునాడుదయం రమ్మన్నాడు. ఆరాత్రంతా ఆహారకమిటీవారు, కూలీలు అక్కడే పస్తులు పడుకున్నారు. మరునాటి ఉదయం మంగళగిరి ఆహారకమిటీ కార్యదర్శితోను, యితర కమిటీ పెద్దలతోను, సంప్రతించి వారిని కూడా కలుపుకొని, షావుకారువద్దకు వెళ్లారు. ఒంటిగంటకు రమ్మని మళ్ళీ వాయిదావేశాడు షావుకారు. తిరిగి అంతాకలిసి ఒంటిగంటకు వెళ్ళారు. తాలూకా రైతుసంఘ కార్యదర్శి కూడా వీరితో కలిశారు. నేలపాడు గ్రామకరణంగారు, బనవోలు - వెంకటపాలెం గ్రామకరణాలు, ఈవిషయం అంతా తెలుసుకొని షావుకారును ఒత్తిడిచేశారు. గ్రామంలో వున్న ముఖ్యులంతాకూడా అక్కడ సమావేశమయారు. వారికి ఆహారకమిటీ పెద్దలు పరిస్థితులన్నీ వివరించి చెప్పారు. నిలవ వ్యాపారస్తులు దేశమంతటా యిలాగే ప్రజల జీవితాలతో చెలగాటమాడుతున్నారనీ, వారి ఆటల నరికట్టకపోతే, ఎంతటి ఉపద్రవాలు సంభవించేదీ, వివరించారు.

ప్రజాబలం

దీనితో నిలవ వ్యాపారస్తుడు యిక లాభం లేదనుకున్నాడు. తన గోడౌన్ తలుపులు తెరిచి, 6 బస్తాల జొన్నలు బయటవేశాడు. ఇంతలో పలుగురు పెర్మిటుదార్లు అక్కడికి వచ్చారు. వీరు ఇదివరలో అదనపు ధరలిచ్చి సరుకును కొన్నవారే. వీరందరికి కంట్రోలు రేట్లకు సరుకు లభించింది.

బస్తాలన్నీ కాటా వేయవలసిన సమయం వచ్చింది. షావుకారు మొదట కాటా వేయడానికి నిరాకరించాడు. కారణం, ప్రతి బస్తాలోను 6 పౌన్ల తరుగువుంది. కాని, లాభం లేకపోయింది. బస్తాలన్నీ సక్రమంగా కాటా వేసి, తరుగు ధాన్యంకూడా యివ్వవలసి వచ్చింది.

చివరకు షావుకారు మరో మతలబీ పెట్టాడు. సంచిలేకుండా సరుకు సప్లయి చేస్తానన్నాడు. ఆహారకమిటీ ప్రతినిధులు వెంటనే కమర్షియల్ టాక్సు ఆఫీసరుకు టెలిగ్రాం యివ్వబోయారు. షావుకారు గజగజలాడుతూ, సంచికూడా యిచ్చివేశాడు.

అంతకుపూర్వం బస్తాకు రు. 2-8-0 చొప్పున అదనంగా యిచ్చి దాదాపు 9 బస్తాల జొన్నలుకొన్న ఒక సంతేపు పెర్మిటుదారుకు షావుకారు విధిలేక, సొమ్ము ముజరా యివ్వవలసివచ్చింది.

దొంగమార్కెట్టుకు 'మేస్త్రీ' సహకారం!

దొంగమార్కెట్టు ఆహారధాన్యాల అమ్మకంలోనే కాదు; ఎరువుల అమ్మకంలోకూడా జోరుగా సాగుతోంది.

గత నెల 8 వ తారీఖు రాత్రి 2 గంటలకు సర్వాషరం కాలువలో, రహస్యంగా రాజమండ్రినుండి వచ్చే రహదారిబోటునుండి 8 బస్తాల అమ్మోనియాను రాయి వెంకటస్వామి (తణుకులోని ఎడ్మినిస్ట్రేటర్ ఆఫీసులో మేస్త్రీ) గ్రంధి రామయ్య కొట్టు (పెనవలి)లో వేయగా, తాలూకా రైతుసంఘ ప్రధాన కార్యదర్శి చేగల సూర్యనారాయణగారు, విద్యార్థిసంఘ అగ్రనేతలు, వంకా సత్యనారాయణగారు గ్రామాధికారులను తీసుకొని వెళ్ళి, అమ్మోనియాను స్వాధీనంచేయించారు.

కిరసనాయిలు దొంగమార్కెట్టు

గూడూరులో కిరసనాయిలు లైసెన్సుదార్లు తమకు వచ్చే కోటాలో చాలాభాగం దొంగమార్కెట్టుకు తీసుకుపోయి, అధికధరలకు అమ్ముకునేవారు. అక్కడి మైకా కార్మికులకు, సామాన్య ప్రజలకు, కిరసనాయిలు సక్రమంగా దొరక్క, అవస్థలు పడేవారు. మైకా కార్మికుల సంఘం ఈవిషయంలో శ్రద్ధ తీసుకొంది. కొందరు లైసెన్సుదార్లపై 'నిగా' వుంచింది. ఆగస్టు 19 వ తేదీని ముంతాలూరి వెంకటసుబ్బయ్య (ఇతడు 5వవార్డుకు లైసెన్సుదారు 1, 3 వార్డులకు లైసెన్సు యితనిఅల్లుని పేరుతోవుంది) పట్టపగలు 2 కిరసనాయిలు డబ్బాలను దాటవేస్తూంటే, వాలంటీర్లు పట్టుకున్నారు. పోలీసులు ఎట్టి చర్యతీసుకోలేదు. అయినా, కార్మికసంఘ నాయకులు నిరుత్సాహపడక, ఆయా వార్డులలో ఆ వర్తకుడు చేసే అన్యాయాన్ని బట్టబయలుచేశారు. 150 సంతకాలతో ఆవర్తకుణ్ణి తొలగించాలని, కో-ఆపరేటివ్ స్టోర్సుకు లైసెన్సు యివ్వాలని, సబ్ కలెక్టరుకు ఒక మహజరు వెళ్ళింది. సదరు డీలరుకు 5 వ వార్డు, 3 వ వార్డు తొలగించారు. 5 వ వార్డుకు లైసెన్సు కో-ఆపరేటివ్‌స్టోర్సుకు యిచ్చారు.

ఇలాగే 11 వ వార్డు లైసెన్సుదారు దొంగ వ్యాపారం చేస్తూంటే, పట్టుకున్నారు. అతని లైసెన్సు కూడా రద్దుచేయబడింది.

మైలవరం రైతుల ఔదార్యం

కరువుబాధను తప్పించడానికి ధాన్యంసప్లై

రైతు ప్రపంచానికంతకూ తిండిపెట్టి పోషించే అన్నదాత. దేశంలో కరువు కాటకాలు తాండవమాడుతూంటే, రైతు జాలి గుండెతో చూస్తూఊరుకోలేడు. తనతోటిమానవుల్ని కరువు రాకాసినుండి కాపాడగలడు.

మైలవరంఫిర్కా (కృష్ణా)లో మొత్తం, 38 గ్రామాలున్నాయి. 8 గ్రామాలలోమాత్రం ధాన్యం, మిగతా గ్రామాలలో వేరుసెనగ, పండుతాయి. ఈ 8 గ్రామాలవారు మైలవరం ఫ్యాక్టరీకి ధాన్యం అమ్మటం, ఆధాన్యాన్ని మిల్లువారు బియ్యంగాఆడి, మిగతా గ్రామాలకు సప్లయిచేయడం, మామూలుగా జరుగుతూ వుంటుంది.

ఈ సంవత్సరం మేనెల నుండి రైతులు ధాన్యానికి యింకా ఎక్కువధర వస్తుందనే నమ్మకంచేత కంట్రోలురేటుకు ఫ్యాక్టరీకి అమ్మటం మానివేశారు. వెంటనే దొంగ మార్కెట్టుకు మంచి అవకాశం దొరికింది. మిల్లు యజమానులు, షావుకార్లు, బెజవాడ నుండి బియ్యంతెచ్చి, అధికధరలకుఅమ్మకం సాగించారు. ఫిర్కాలోవున్న అత్యధిక గ్రామాల్లో రైతులు-కూలీలు సరుకు కొనుక్కోలేక, యిబ్బందిపడ్డారు.

తాలూకా రైతుసంఘం పరిస్థితుల తీవ్రతను గుర్తించింది. 21-7-44 వ తేదీని కుంటముక్కల జమీందారువద్ద నిల్వవున్న వెయ్యి బస్తాల ధాన్యాన్ని బస్తా రు. 10-14-0 చొ॥న స్థానికాధికార్ల సహాయంతో మిల్లుకు యిచ్చునట్లుచేశారు. ఇద్దరు రైతుల్ని కూడా ఒప్పించి, 200 బస్తాలు యిప్పించారు. ఆ తారీకునే తహసిల్దారు వెల్వడం వచ్చి, 5 యకరాలకు పైగా భూమివున్న ప్రతిరైతు యకరం 1కి 12 బస్తాలచొప్పున యివ్వవలసిందని హెచ్చరించాడు. కాని, రైతులు తమవద్ద నిల్వ సరుకు లేనేలేదని జవాబు చెప్పారు. అధికారులు రిక్విజిషన్ నోటీసులు పంపుతామని బెదిరించారు కాని ప్రయోజనం లేకపోయింది.

వెంటనే, రైతుసంఘ వర్కర్లు జోక్యం కలిగించుకున్నారు. నిల్వవ్యాపారస్తులమాదిరి రైతులు కూడా ప్రవర్తిస్తే మిగతా ఫిర్కా గ్రామాలకు ఎలా ముప్పు వాటిల్లుతుందో, ఎలా ప్రజల్ని మిల్లు యజమానుల దురాశకు బలియివ్వడమవుతుందో, తెలియజేశారు. రైతుల దేశభక్తికి విజ్ఞప్తి చేశారు. ఫలితం, రెండురోజుల్లో 400 బస్తాలు బస్తా రు. 10-14-0 కు వచ్చాయి! ఈ 400 బస్తాలు, కుంటముక్కలలో లభించిన 1200 బస్తాలు, మిల్లుయజమానులు రివెన్యూ ఇన్‌స్పెక్టరు చీటీలేకుండా ఎవరికి అమ్మకూడదని ఉత్తరువు జారీచేయబడింది. ఈవిధంగా ఫిర్కాలోని గ్రామాలన్నింటికి సరుకు లభించింది.

9-9-44 వ తేదీ నాటికి మళ్ళీ యీ సరుకు అయిపోయేటట్లుంది. మిల్లు యజమానులు సరుకును కొనేటట్లులేరు. రైతుసంఘ వర్కర్లు ముందుగానే మేల్కొని, 4-9-44 వ తేదీని మిల్లు యజమానివద్దకు వెళ్ళారు. ప్రజలు కరువు కాటకాలతో బాధపడుతూంటే, స్వార్థం కొరకు దేవుళ్ళార్థం న్యాయంకాదని విజ్ఞప్తి చేశారు. న్యాయమైన లాభంతీసుకొని, రైతుకు సక్రమమైన ధరయిస్తే, సరుకు లభిస్తుందని సూచించారు. మిల్లు యజమాని అంగీకరించాడు. బస్తా 1కి 10-14-0 చొప్పున యిస్తానని వాగ్దానంచేశాడు. రైతుసంఘ వర్కర్లు యీ విషయం రైతులకు తెలియజేస్తే, వెల్వడంలో 9 వ తారీకున 400 బస్తాలు లభించాయి. ఆరోజునే సరుకును మిల్లుకు తోలేరు. ప్రక్కనున్న గణపవరం గ్రామ రైతులు (8గురు) మరో 400 బస్తాలు విడుదల చేశారు.

ఫిర్కాకు నెలకు దాదాపు 700 బస్తాల వరకు బియ్యంఅవసరం (అమ్మకం.) ఈసరుకును రైతులే దేశభక్తితో సప్లయి చేసేటట్లు చేయడానికి తాలూకా రైతుసంఘం పూనుకొని పని చేస్తూంది.

★

సవరణ

గత సంచిక "మన రాజకీయాల" లో "గాంధీ - జిన్నాల 'బ్రిటిష్' సందేశం" అనే శీర్షిక వుంది. అది బ్రిటిష్ సందేశం కాదు; రంజాన్ సందేశం. బ్రిటిష్ పండుగ యింకా కొన్నాళ్ళకుగాని రాదు. పాఠకులు యీ సవరణను గుర్తించ గోరెదము.

నూలు కంట్రోలు స్కీముకు పురిటిలోనే సంధి?

— పిల్లలమర్రి వెంకటేశ్వర్లు

మన ఆంధ్రదేశంలో మొత్తం 141 వేల మగ్గాలున్నాయి. వీటిమీద దాదాపు 6 లక్షల మంది జీవిస్తున్నారు. కాని యుద్ధం వచ్చిన తరువాత నూలుధర విపరీతంగా పెరిగింది. కొన్నింటి ధర 4 లేక 5 రెట్లవరకు కూడ పెరిగింది. ప్రభుత్వం యీ రేట్లనే సీలింగురేట్లుగా నిర్ణయించింది. ఈ రేట్లు తగ్గించాలని ప్రజాందోళన రేగింది. ప్రభుత్వం ధరలు కొద్దికొద్దిగా తగ్గించింది. వెంటనే నూలు మాయమయింది. దొంగ మార్కెట్టులోకి పోయింది. వేలకు వేలు మగ్గాలు మూలపడ్డాయి. కార్మికుల ఇండ్లలో కుండలు డింకీలు కొట్టసాగాయి. కార్మికులు బజారులపాలైనారు. గుడ్డ కరువు యేర్పడింది. నేతగుడ్డకు ప్రజలు మొగవాచారు. కాని నేతగుడ్డయేది? నూలు సప్లయి లేనిది గుడ్డ యెక్కడనుండి వస్తుంది? బ్లాకు మార్కెట్టురేట్లు నక్షత్రాలను అందుకున్నాయి. చేనేత కార్మికులకు తిండిలేదు. ప్రజలకు బట్టలేదు. నేత కార్మికులకు మద్దతుగా ప్రజలు - వీరి ఆందోళన మిన్నుముట్టింది. తత్ఫలితంగా రాష్ట్ర టెక్స్టయిల్ కమిషనర్ ఆగస్టు రెండవవారంలో ఒకస్కీము ప్రవేశపెట్టాడు. బ్లాకుమార్కెట్టును వేటాడి నూలు నేతకార్మికులకు అందుబాటులోఉంచటానికే వీరు దీన్ని వుద్దేశించారు. మగ్గానికి యెంత నూలు కావలెనో అంచనావేసి, జిల్లాలో యెన్ని మగ్గాలు వున్నాయో లెక్కలుతేల్చి, జిల్లాకోటాలు నిర్ణయించారు. జిల్లాలు యీ నూలు వ్యాపారం జరగటానికి చిల్లర వ్యాపారస్థులను, టోకు వ్యాపారస్థులను, కోటాదారులను ప్రభుత్వం నియమించింది.

జిల్లాలలో కోటాల ప్రకారంగా మిల్లులు కోటాదారులకు నూలు సప్లయి చేస్తాయి. వీరు జిల్లాలకు తమ బ్రాంచీలద్వారా సప్లయి చేస్తారు. బ్రాంచీలు లేకపోతే, ఒకరిద్దరు వ్యక్తులపేరిట పంపుతారు. వీరి దగ్గరనుంచి టోకువ్యాపారస్థులు కోటా ప్రకారం తీసుకుని చిల్లరవ్యాపారస్థులకుకోటావారీగాఅమ్ముతారు, ఈ చిల్లరవ్యాపారస్తులవద్దనుంచి నేతపనివారు తమ కోటాలు కొంటారు.

ఈ స్కీము ప్రకారం క్రిందనుంచి పైదాకా యెవరెవరివద్దనుంచి కొనాలోకూడ నిర్ణయించబడ్డది.

ఈస్కీము ప్రకారం కోటాలు సక్రమంగా చేరి సరిగా పంపిణీ జరిగేందుకు జిల్లా టెక్స్టయిల్ ఆఫీసర్, ఆయా జిల్లాలలోవుండే నేత కార్మిక సంఘ ప్రతినిధి, నేతగుడ్డషావుకార్ల సంఘప్రతినిధి, నూలువ్యాపారస్తుల ప్రతినిధి వీరితోకూడిన కమిటీని యేర్పరచి ఆ కమిటీ మాత్రాల ప్రకారం నూలు పంపిణీ జరగాలి.

చేనేత కార్మికులలో గల్గిన సంక్షోభాన్ని గుర్తించి, రాష్ట్ర టెక్స్టయిల్ కమిషనర్ మన రాష్ట్రంలోని మిల్లులన్నిటికి ఆగస్టునెల ఆఖరిలోగా, ప్రతి జిల్లాకు తమ కోటాల ప్రకారం ముందు నూలు సప్లయి చెయ్యాలని హెచ్చరించాడు. అందుకు అవసరమైతే యీ కోటాలు పంపే తవరకు యితరచోట్లకు పర్మిటువున్నప్పటికి, నూలు పంపరాదన్నాడు. సెప్టెంబరునుంచి యీ స్కీము ఆచరణలోనికి వచ్చింది.

ప్లానుమాత్రం చాలా సవ్యంగామున్నది. బ్లాకు మార్కెట్టును అరికట్టి నూలు పంపకం సక్రమంగా జరిపించాలనే వుద్దేశం స్పష్టమగుచున్నది. ఇందుకు వుపయోగపడుతుందికూడా. ఈస్కీము జయప్రదం కావడానికి నేత కార్మికసంఘం తప్పక సహకారం చెయ్యాలి. అప్పుడు నూలు అందరికి అందుబాటులోవుంటే, చేనేత కార్మికులు యీ వృత్తిలోనే తమ జీవయాత్ర సాగించగలుగుతారు.

కాని యేదో సామెతచెప్పినట్లు అసలు నూలు స్టాకులేనిది యెంత మంచిప్లాను అయినా యెండమావుల లాంటిదే. గుంటూరు జిల్లాలో మొదటివారం మాత్రం నూలు సప్లయిచేశారు. ప్రతివారం సప్లయిచెయ్యాలి. కాని నెలతిరిగింది. ఒక్కవారం మాత్రమే రేషను ఈయబడింది. మళ్ళీ కార్మికులు రేషన్ కష్టంతో కొట్లముందు గుమికూడుతున్నారు. షావుకార్లు చేతులనలుపుకుంటూ కాగాలు మెళ్ళోనుంచి క్రిందకు వ్రేళ్ళాడేసుకొని కొట్టుముందు నుంచుంటున్నారు. నిత్య [illegible] మగ్గాలదగ్గరకు పోవడం యిష్టంలేక పూరంతా ఒక ప్రదక్షిణంచేసి, కొంప చేరుకుంటున్నారు కార్మికులు. మద్రాసు నుండి బండివచ్చేటప్పటికి వీరు రైలుస్టేషను వద్ద తయారు.

వీరందరికి ఆశాభంగం కలిగాలిసిందేనా? బ్లాకుమార్కెట్టు దేవతా వుపాసకుల తంత్రాలకు యీ స్కీము భగ్నమైపోవలసిందే? చేనేత కార్మికులు అంత అవివేకులై తమకు ప్రాణతుల్యమైన యీ స్కీమును జారవిడుచుకుంటారా? ప్రభుత్వం స్టాకు నిలవచేయక, సప్లయి అందజేయకపోవుటవల్లగదా యీ పరిస్థితులు యేర్పడ్డయి. అందువల్ల చేనేత కార్మికులు చెయ్యవలసింది యేమిటి? సప్లయిలు వెంటనే పంపాలని తీవ్రమైన ఆందోళన చెయ్యాలి. ఈ స్కీమును ఆచరణలో నుంచుటయే తమ కర్తవ్యమని చాటాలి. మిల్లులనుంచి నూలు కోటా - హోల్డర్సుకు చేరలేదా, లేక కోటా-దారులకు టోకువ్యాపారస్థులకు పంపలేదా, దీని కీలకం యెక్కడ వున్నది? బ్లాక్‌మార్కెటు ఏర్పడిందా? ఈ విషయాలపై వెంటనే ప్రభుత్వం తోగట్టా చెయ్యాలి. టోకు వ్యాపారస్థులు కోటా-హోల్డర్సు తమకు లాభాలు చాలటంలేదని గునుస్తున్నట్లు వినికిడి. అత్యాశకు గురియైన యీ దేవతలు స్కీమునే భగ్నం చేయుటకు పన్నిన పన్నాగము కావచ్చు. అలా జరిగేవుంటే, ప్రభుత్వం వెంటనే జోక్యం కలుగజేసుకుని, వారిని తొలగించి, కో-ఆపరేటివు స్టోర్సుద్వారాగాని, దురాశాపరులుగాని వర్తకులచేతగాని విక్రయం జరిగేటట్లు చూడాలి.

నేత కార్మికులు నిస్పృహకు తలొగ్గకూడదు. ఈ స్కీమువల్లకాదు యీ పరిస్థితులు వచ్చింది. స్టాకులేమియే యీ దారుణ పరిస్థితులకు కారణం అందువల్ల ప్రభుత్వం వెంటనే కోటాల ప్రకారం నూలు కనీసం ఒకనెలకు సరిపోవు స్టాకు నిలవచెయ్యాలి. స్టాకు నిలవవుంటే వాగనుల సప్లయి ఆలస్యమైనా కార్మికులకు సప్లయిలు ఆగిపోవు. యధావిధిగా గుడ్డ వుత్పత్తి జరుగుతుంది. అందువల్ల నేత కార్మికులు సప్లయిలు వెంటనే పంపాలని, స్టాకు నిలవవుంచాలని ఆందోళన చెయ్యాలి.

నిమ్నజాతి నాయకుల కర్తవ్యం

(8 వ పేజీ తరువాయి) వాటిని యే జాతిదారు తాకట్టుపెట్టుకోడానికిగాని, లేదా వేలం వేయించడానికిగాని, వీలులేకుండా నిషేధించాలి.

ప్రత్యేక నియోజకవర్గాలు

ఈ కమిటీ సంయుక్త నియోజకవర్గాలను రద్దుచేసి, నిమ్నజాతులకు ప్రత్యేక నియోజకవర్గాలను యేర్పరచాలని తీర్మానించింది. ఇదే అభిప్రాయాన్ని అంబేద్కరు తన ఉపన్యాసాలలో వెల్లడించాడు. బ్రిటిషుప్రభుత్వం యిచ్చిన "కమ్యూనల్ అవార్డు"లో నిమ్నజాతులకు ప్రత్యేక నియోజకవర్గాలిచ్చింది. గాంధీజీ యిందుకు వ్యతిరేకించారు. ఆయన నిరసన వ్రత సమయంలో హిందూనాయకులు, హరిజన నాయకులు కలసి ఒడంబడిక చేసికొన్నారు. దానిప్రకారం బ్రిటిషు ప్రభుత్వం "కమ్యూనల్ అవార్డు"ను మార్పుచేసింది. సంయుక్త నియోజకవర్గాలు వచ్చాయి. ఈ సంగతి వ్యాసం మొదట్లోనే తెలిపాము.

ఇంత చరిత్ర సంయుక్త నియోజకవర్గాల వెనుకవుంది. కాని యిపుడు మరల నిమ్నజాతుల నాయకులు ప్రత్యేక నియోజకవర్గాలు కోరుతున్నారు. అందుచే ఈ విషయమై దేశభక్తులు తీవ్రంగా ఆలోచించవలసివుంటుంది. హరిజన సేవాసంఘం కొంత కృషిచేసినప్పటికి, అంటరానితనమనే కళంకం పూర్తిగా యింకా తొలగలేదు. అందుచేతనే నిమ్నజాతులనాయకులలో అసంతృప్తి వుంది. ప్రత్యేక నియోజకవర్గాలు కోరడంలో అదేవిషయం ద్యోతకమవుతోంది. దేశభక్తులు అస్పృశ్యతా నివారణకు యింకా తీవ్రంగా కృషిచేయాలి. నిమ్నజాతులకు సంయుక్త నియోజకవర్గాలే లాభమని నమ్మేటట్లు చెయ్యాలి. లేనిచో ప్రత్యేక నియోజకవర్గాలకు అంగీకరించవలసి యుంటుంది.

నిమ్నజాతి నాయకుల కర్తవ్యం

ఈ సందర్భంలో నిమ్నజాతి సోదరులకు ఒక హెచ్చరిక చేయవలసివుంది. మీరు పీడిత కులాలకు చెందినవారు. సమాన గౌరవం, సమానహోదా సంపాదించడానికి మీరు పోరాడటం న్యాయమైనదే. కాని రాజ్యాంగంలో విద్య, వగైరా విషయాలలో నిమ్నజాతులకు రక్షణలు వుండాలని కోరడం సహజమే.

కాని ఒకవిషయం మీరు మరువకూడదు: బ్రిటిషు ప్రభుత్వం మన చీలికలను ఉపయోగించుకొని, భారత స్వాతంత్ర్యానికి అడ్డు తగలడానికి ప్రయత్నించుతుంది. అందుకు ఎవరూ సాయపడకూడదు. 150 ఏండ్ల కాలములో బ్రిటిషు ప్రభుత్వం నిమ్నజాత్యుద్ధరణకు చేసిన ఘనకార్యమేమీ లేదు. ఈ సంగతిని గమనించితే, నిమ్నజాతుల హక్కులకొరకు జరిగే పోరాటం, భారత స్వాతంత్ర్య పోరాటంలో భాగమని తేటతెల్లమవుతుంది.

మద్రాసు ఉపన్యాసంలో జస్టిసుపార్టీ పతనాన్ని గురించి మాట్లాడుతూ డాక్టరు అంబేద్కరు యిలా చెప్పారు. జస్టిస్‌పార్టీ 20 సంవత్సరాలు రాష్ట్రప్రభుత్వాధికారంలో వుంది. కాని 1937 ఎన్నికలలో [illegible] కూలిపోయింది. ఎందువలన? అని ప్రశ్నించాడు. అతడే యిలా జవాబిచ్చాడు. "తాను అధికారంలోవున్న 20 యేండ్లలో యీపార్టీ గ్రామాలలోవున్న నూటికి [illegible] మంది బ్రాహ్మణేతరులను మరచిపోయింది. ఆ బీదలు దారిద్ర్యం అనుభవించుచూ [illegible] పాలయ్యారు." వారిని వర్గ వ్యాపారుల[illegible] రక్షించడానికి జస్టిస్‌పార్టీ ఏమీ చేయలేదు. అందుకే కూలిపోయిందన్నాడు. ఈ [illegible]మను అన్ని పార్టీలకు నిజంగా గుణపాఠంగా వుండాలి. నిమ్నజాతి నాయకులుగూడ గమనించాలసిన విషయం యిది.

మరొక విషయం కూడా హెచ్చరించవలసివుంది. మైనారిటీలకు సమానమైన హక్కులుకావాలనిఒకవైపుకోరుతూ రాబోవు భారతరాజ్యాంగం 'డొమినియన్'గా వుండాలని ఫెడరేషన్ తీర్మానాలలో ఒకదాన్లో సూచించబడింది. 'డొమినియన్' అంటే 'బ్రిటిషు డొమినియన్' అనే గదా! నిమ్నజాతుల నాయకులు యిలాంటి దృక్పథాన్ని వెల్లడించడం తమ ప్రజా ఉద్యమానికే నష్టకరమైనదని గుర్తించాలి. భారత ప్రజలలో ఎవరూ బ్రిటిషు సామ్రాజ్యపు సంకెళ్లలో కట్టుబడివుండాలని కోరడంలేదు. పైగా, ఇతర దేశభక్తులలో, స్వాతంత్ర్యవాదులలో నిమ్నజాతులనాయకుల యెడల సందేహాలు కలిగించుతుంది. పైగా సుమారు 200 యేండ్ల బ్రిటిషు పరిపాలనక్రింద నిమ్నజాతుల కష్టాలు తీరలేదనడం లోకవిదితమేగదా!

అందుచే నిమ్నజాతుల నాయకులు ఈ సత్యాన్ని తెలిసికోవాలి. బ్రిటిషు సామ్రాజ్యవాదులు తమకేదో ఒరగబెడతారనే ఆశను వదలుకోవాలి. తమ ప్రజలు న్యాయమైన హక్కులకొరకు పోరాడాలి. దేశభక్తులందరూ జరిపే స్వాతంత్ర్యోద్యమంలో భాగంగా నిమ్నజాతుల ఉద్యమాన్ని నడపాలి, అపుడే అంటరానితనం మాసిపోతుంది. నిమ్నజాతి ప్రజల హక్కులు రక్షింపబడుతాయి. స్వతంత్ర భారతదేశంలో వారు తక్కిన ప్రజలందరితో బాటు సమానహక్కులు, గౌరవం పొందగలుగుతారు.

దేశభక్తుల కర్తవ్యం

ఇదేవిధంగా యితర దేశభక్తులుకూడా ఒక విషయం గమనించాలి. భారత స్వాతంత్ర్యోద్యమం ముందంజ వేసేకొలదీ పీడితప్రజలు మేల్కొంటున్నారు. తమ హక్కులను డిమాండు చేస్తున్నారు. వీటినిచూచి బ్రిటిషు ప్రభుత్వం చీలికలెక్కువ చేయడానికి ప్రయత్నించడం సహజం. పీడితప్రజల హక్కులకు హామీయిస్తూ, అందరినీ కలుపుకొని భారత స్వాతంత్ర్యరథాన్ని ముందుకు తీసుకుపోడం దేశభక్తుల కర్తవ్యం. అంతేగాని తమ ప్రత్యేక హక్కులను కోరినవారందరినీ ప్రభుత్వ ఏజెంట్లని దూషించడం తగదు. పైగా సామ్రాజ్యవాదులుకోరే చీలికలకు అవకాశమిచ్చిన వారమవుతాం.

వలసదేశాలపట్ల అమెరికా వైఖరి యేమిటి?

III

క్విబెక్ సమావేశం ఎందుకు విఫలమయింది?

— తుమ్మల వెంకటరామయ్య

అమెరికాలో ఎన్నికల కోలాహలం ప్రారంభమయింది. అధ్యక్షుడు రూజ్‌వెల్టు సెప్టెంబరు 23 న తేదీన గావించిన ఉపన్యాసంలో, రిపబ్లికన్‌పార్టీ అభివృద్ధినిరోధక పోకడను బయటపెట్టాడు.

అమెరికాలో ముఖ్యమైన పార్టీలు రెండు. ఒకటి రిపబ్లికన్‌పార్టీ; రెండవది డెమాక్రాటిక్‌పార్టీ. ఇందులో రిపబ్లికన్‌పార్టీ కరుడుగట్టిన గుత్తవ్యాపారుల, అభివృద్ధినిరోధకుల గుప్పిటలో వుంది. ఇది ఫాసిస్టుల కనుకూలమైన ధోరణి నవలంబించుతూంది. ప్రజాస్వామ్య విజయాన్ని కుంటుపరిచే పనులన్నిటినీ ప్రత్యక్షంగాను, పరోక్షంగాను, చేస్తోంది. దీనికి పూర్తిగా విరుద్ధమైన వైఖరిని డెమాక్రాటిక్‌పార్టీ అవలంబించుతోంది. డెమాక్రాటిక్‌పార్టీతరపునే రూజ్‌వెల్టు అధ్యక్షపదవికి పోటీచేస్తున్నాడు. ఇలా అని రిపబ్లికన్ పార్టీలో 100 కి 100 గురు అభివృద్ధినిరోధకులనీ, డెమాక్రాటిక్ పార్టీలోనివారంతా పురోగాములనీ భావించరాదు. ఉదాహరణకు, అమెరికా సంయుక్తరాష్ట్రాలలోని దక్షిణభాగంలో డెమాక్రేట్‌లు జమీందార్లు. వీళ్ళ భావాలు రిపబ్లికన్ పార్టీలోని అభివృద్ధినిరోధకులవలెనే ఉంటాయి. అలాగే రిపబ్లికన్ పార్టీ వెనుకనున్న మామూలు శాసనసభ్యులంతా, లేక వారికి వోట్లిచ్చిన ప్రజలంతా, అభివృద్ధినిరోధకులు గాదు. ఎక్కువ భాగం, ముఖ్యంగా నాయకత్వం, అభివృద్ధినిరోధక ముఠాకు చెందింది. రిపబ్లికన్‌పార్టీలో కూడా విల్కీలాంటి ఏకొద్దిమందో, అభివృద్ధికర భావాలు గలవారు లేకపోలేదు.

రిపబ్లికన్‌పార్టీ ధోరణి

కాని మొత్తంమీదచూస్తే, రిపబ్లికన్‌పార్టీ ధోరణి ఒక అమెరికాకేగాక, ప్రపంచానికంతకూ నష్టదాయకమైనది.

గత యుద్ధానంతరం ఈపార్టీ అధికారంలో ఉండికూడా ప్రపంచశాంతి భద్రతలను కాపాడటానికి ఎట్టి కృషిచేయలేదు. "నన్ను ముట్టుకోకు నామాలకాకి" అంటూ ఉండిపోయింది. రూజ్‌వెల్టు అధ్యక్షత వహించినతర్వాతకూడా వీరు "అమెరికాకు యుద్ధప్రమాదంలేదు. మనం యుద్ధంలోకి దిగరాదు" అంటూ ప్రచారం చేస్తూవచ్చారు. తటస్థత పేరిట ఫాసిస్టుల కనుకూలంగా ప్రవర్తించారు. ఈనాడు యుద్ధములో ప్రాణాలర్పిస్తున్న అనేకవేల సైనికులకు, నావికులకు వోటులేకుండాచేసింది వీరే. వీరికి వోటింగువుంటే తమ అధికారానికి స్వస్తిచెప్పవలసి యుంటుందని రిపబ్లికన్‌పార్టీ నాయకులు భయపడ్డారు.

కార్మికులకు హక్కులు ఈయకపోగా, ఉన్నవాటినిగూడా అమలులోకి రాకుండా చేయడానికి రిపబ్లికన్‌పార్టీ ముఠా, శాసనసభలలోను, కోర్టులలోను, పత్రికలలోను ఎంతో కృషిచేసింది.

రూజువెల్టు వాగ్దానం

రిపబ్లికన్‌పార్టీ చేసిన ఈతప్పులన్నీ తిరిగి జరుగకూడదని రూజువెల్టు తన పై ఉపన్యాసంలో తెలియజేశాడు. సైనికులకు వోటింగ్ హక్కు ఇవ్వాలన్నాడు. నిరుద్యోగ సమస్య లేకుండా చేయాలన్నాడు. కార్మికుల కొనుగోలు శక్తిని పెంచెట్టాలన్నాడు. "యుద్ధం నుండి తిరిగివచ్చే సైనికులను, ఫ్యాక్టరీలలోని కార్మికులను, పొలాలలోని రైతులను గనులలోని కార్మికులను, ఆఫీసులలోని, దుకాణాలలోని స్త్రీపురుషులను-వీరందరినీ మనం మరచిపోరాదు. వీరు దేశానికి 'భారం' అని భావించరాదు. వీరూ అమెరికన్లే" అంటూ రూజువెల్టు ప్రసంగించాడు.

ఇదంతా ఏదో ఎలక్షన్ 'స్టంట్' లే, అని తోసివుచ్చడానికి వీల్లేదు. రూజ్‌వెల్టు అధికారానికి వచ్చాక నిరుద్యోగసమస్యను కొంత తగ్గించడానికి ప్రయత్నించాడు. కార్మికుల హక్కులను కాపాడపూనుకొన్నాడు. గుత్తవ్యాపారస్తులైన కోటీశ్వరులను ఎదుర్కొన్నాడు. అందుచే ఈవాగ్దానాలు వట్టి ఎలక్షన్ వాగ్దానాలుగా మాత్రమే ఉండజాలవు. ప్రపంచ పరిస్థితులుకూడా అలా ఉండనీయవు.

అమెరికాలోని పై రెండుపార్టీలు గూడ పెట్టుబడిదారీ పార్టీలే అయినా, రిపబ్లికన్ పార్టీ కరుడుగట్టిన గుత్త వ్యాపారస్తులకు చెందినది. ఈ గుత్తవ్యాపార సంస్థలకూ, జర్మనీ మొదలగు ఫేసిస్టు గుత్త వ్యాపార సంస్థలకూ సంబంధంవుంది. యుద్ధం వచ్చినా వీరు కొన్ని తటస్థదేశాలద్వారా ఈ సంబంధాన్ని నిలబెట్టుకుంటూనే వచ్చారు. ఈ సంబంధ బాంధవ్యాలవల్లనే, ఫాసిస్టు అనుకూలవైఖరిని అవలంబించుతూ వచ్చారు. తమదేశానికి హానికరమైన ఆచూకీని శత్రువుకు తెలుపుతూ వచ్చారు. ఇలా స్వార్థంకోసం, దేశాన్ని శత్రువులకు ఈయడానికికూడ సిద్ధపడే గుత్తవ్యాపారులను ఎదిరించుతోంది రూజ్‌వెల్టు ప్రభుత్వం. మున్ముందు గుత్తవ్యాపార సంస్థలను (కార్టెల్స్) రద్దు చేయాలనికూడా రూజ్‌వెల్టు అన్నాడు. ఇలా రూజ్‌వెల్టు ప్రభుత్వం తన దేశవ్యవహారాలలోనేగాక అంతర్జాతీయంగాకూడ అభివృద్ధికరమైనపాత్రనే (ముఖ్యంగా బ్రిటనుతో పోల్చిచూచినపుడు) వహించుతోంది.

వలసరాజ్యాలపట్ల వైఖరి

ఈయుద్ధంలో విజయం అంటే ఒక్క ఫాసిజంమీద, అభివృద్ధి నిరోధకతత్వంమీద, నిరంకుశత్వంమీద, విజయంమాత్రమేగాదు: ఇది ప్రజాస్వామ్య విజయం - అంటూ రూజువెల్టు అన్నాడు.

బ్రిటన్ - అమెరికాలు రెండూ పెట్టుబడిదారీ దేశాలయినప్పటికీ, వలసదేశాల విషయంలో వీరవలంబించే వైఖరిలో పూర్తిగా భేదంవుంది. ఫిలిప్పైన్స్ స్వాతంత్ర్య విషయంలో రూజువెల్టు ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేసింది.

ఫిలిప్పైన్ దీవులు అమెరికాక్రింద వుండేవి. యుద్ధానంతరం ఎట్టి మినహాయింపులు లేకుండా ఫిలిప్పైన్స్‌కు స్వాతంత్ర్యం ఇస్తామని రూజ్‌వెల్టు ప్రకటించాడు. అలాగే, అట్లాంటిక్‌చార్టర్ అన్నిదేశాలకూ వర్తిస్తుందని ప్రకటించాడు. ఇంకొక ఉదాహరణ: మార్షల్ దీవులకు స్వాతంత్ర్యమిస్తున్నామని అమెరికా ప్రభుత్వంతరపున, పసిఫిక్ యుద్ధరంగ సర్వసైన్యాధిపతి నిమిట్జ్ ప్రకటించాడు మార్షల్‌దీవులు 1887 లో జర్మనీక్రిందకు వచ్చాయి. గత యుద్ధానంతరం అవి జపానుక్రిందకు వచ్చాయి. ఇప్పుడు అమెరికన్ సేనలు వీటికి విముక్తి గల్గించాయి.

ఇండియాకు అట్లాంటిక్ చార్టర్ వర్తించదనే, చర్చిల్ వైఖరి సుస్పష్టమే. బర్మా స్వాతంత్ర్యాన్ని గురించికూడ ఒక్క వల్లెత్తుమాటకూడ అతని నోటినుండి వెలువడలేదు.

వలసదేశాలకు స్వాతంత్ర్యం ఇవ్వకుండా వట్టి వ్యవసాయక దేశాలుగామాత్రమే వాటిని ఉంచాలని నేడు బ్రిటిషు సామ్రాజ్యవాదులు కోరుతున్నారు. వలసదేశాలనుంచి ముడిపదార్థాలు తీసుకుపోయి, తమ పారిశ్రామిక వస్తువుల్ని దిగుమతి చేయాలనే చూస్తున్నారు కాని అమెరికా అలా అనడంలేదు. వలసదేశాలకు రాజకీయ స్వాతంత్ర్యం ఈయాలంటున్నది ఆ దేశాలలో పరిశ్రమలు వెనుకబడివున్న దిగనుక, అక్కడికి యంత్ర సామగ్రిని ఎగుమతిచేయాలంటుంది. అమెరికా ఆవిధముగా వెనుకబడిన దేశాలలో పరిశ్రమలకు సహాయపడి వారి కొనుగోలుశక్తిని హెచ్చించి, వారితో వ్యాపారం సాగించి లాభాలు పొందుతామంటున్నది. ఈ పద్ధతివల్ల తమ దేశంలో నిరుద్యోగంకూడ తగ్గించ వీలవుతుందని భావించుతోంది. చైనాలో యీ విధంగానే, పరిశ్రమలకు సహాయం చేస్తోంది. బ్రిటిష్ సామ్రాజ్యవాదులు అడ్డంకులు గల్పించని పక్షంలో ఇండియాలోకూడ అలాగే చేయాలని తలుస్తోంది.

కాబట్టి, రెండూ పెట్టుబడిదారీ ప్రభుత్వాలే అయినప్పటికీ, తమ సామ్రాజ్య దేశాలకు ముడి వస్తువులు సప్లయిచేసే వ్యవసాయక దేశాలుగానే వలసదేశాలను వుంచాలనే బ్రిటన్ తంటె. అమెరికా ఈనాడు అభివృద్ధికరమైన పోకడ పోతోంది.

ఈనాడు ఇండియా, బర్మాల స్వాతంత్ర్యం విషయమై ఆలోచించకుండా జపానును త్వరలో ఓడించడం సాధ్యమైనపనికాదు. అందుచేతనే క్విబెక్ సమావేశం విఫలమయింది.

క్విబెక్ సమావేశం

క్విబెక్ సమావేశంలో అన్నివిషయాలలోను మేము ఏకాభిప్రాయానికి వచ్చాం అంటూ చర్చిల్ చెప్పుకొన్నాడు. కాని రూజ్‌వెల్టు - చర్చిలు కలిసి క్విబెక్ సమావేశ అనంతరం ఇచ్చిన ప్రకటన అస్పష్టంగావుంది. జర్మనీపై యుద్ధం ఎప్పుడు పూర్తి అవుతుందో తెలియదు; పూర్తి అవగానే జపానుపై విజృంభిచుతాం, అని అస్పష్టంగా వుందేగాని జపానును త్వరగా ఓడించే పథకం ఏదీ వారు బయట పెట్టలేదు.

ఈనాడు అమెరికన్ నౌకలు, సైన్యాలు, పసిఫిక్‌లో ఒక ద్వీప సముదాయం వెనుక మరొక ద్వీప సముదాయాన్ని పట్టుకుంటూ ముందుకు వెళ్ళుతున్నాయి. ఇపుడు ఫిలిప్పైన్ మీద, డచ్ ఈస్టిండీస్ దీవులమీద దెబ్బలు కొడుతున్నాయి. వీటిభావికార్యక్రమంఏమిటి? ఫిలిప్పైన్సును, డచ్ తూర్పు ఇండియా దీవులను, పట్టుకోవాలి. చైనాలో జపానుపై బాంబులు కురిపించడానికి అనువైన కేంద్రాలను పట్టుకోవాలి చైనాలోని జపాను సేనల్ని తరమాలి. జపాను నౌకలతో ప్రత్యక్షంగా తలపడి నాశనంచేయాలి. చివరకు జపాను నడిగడ్డపైనే యుద్ధంచేయాలి. కాని ఇలా యుద్ధంచేస్తేఏళ్ళ తరబడి యుద్ధం ఈడ్చుకు పోతుంది.

ఒక్క పసిఫిక్‌లోనేగాక, చైనా, బర్మా, మలయాలనుండి కూడ యుద్ధం సాగించితే, జపాను త్వరలో క్రిందికి దిగివస్తుంది. కాని ఇలా చేయాలంటే, చైనా - బర్మారోడ్డును తెరవాలి: చైనాకు ఆయుధా లెక్కువ ఈయాలి, భారతదేశ సమస్యను పరిష్కారం చేయడమే, జాతీయప్రభుత్వంలేనిదే, ఈ విషయం అంత సులభంకాదు. జపానుపై యుద్ధం చేయడానికి ఇండియా వేదికగా వుండాలంటే, ఇండియా ఎంతో యుద్ధభారాన్ని మోయాలిసివుంటుంది: ప్రయాస పడవలసి యుంటుంది. రైళ్ళ రాకపోకల విషయం ఒక్కటేగాక, అనేకవిధాల యుద్ధభారాన్ని వహించవలసియుంటుంది. ప్రజల అండతో సానుభూతిగలిగిన జాతీయప్రభుత్వమొక్కటే ఆ భారాన్ని తట్టుకోగలదు.

కాని చర్చిలుకు భారతదేశ సమస్యను పరిష్కరించడానికి ఇష్టంలేదు. అందుచే అతని ప్లాను ఏమిటి? బర్మా, సింగపూరుల నుండి జపానుపై దండయాత్రచేయడంకాదు అతని వ్యూహం. సింహళంలో స్థావరం ఏర్పరచుకొని, అక్కడనుండి తన నౌకల్ని, విమానాలను పంపి, అమెరికావాళ్ళతో కలిసి యుద్ధంచేయడం చర్చిల్ ప్లాను. ఈ ప్లాను వల్ల యుద్ధం దీర్ఘకాలం కొనసాగుతుంది. భారతదేశ సమస్యను పరిష్కరించకుండా తప్పుకోవచ్చు. ఇదీ చర్చిల్ ధోరణి.

అందుకనే, క్విబెక్‌లో ఒక స్పష్టమయిన నిర్ణయానికి రాలేకపోయారు. రూజ్‌వెల్టు బర్మాను విముక్తిచేసి, చైనారోడ్డును తెరవాలని ఒత్తిడిచేసివుంటాడు అంతే పరోక్షంగా భారతదేశ సమస్యను పరిష్కరించమని అడిగివుంటాడు. కాని చర్చిల్ దీక్షయుద్ధానికే సిద్ధపడి ఇందుకు వ్యతిరేకించాడు. అందుచే క్విబెక్ కాన్ఫరెన్సు ఫలితాలేమిటి?

— పసిఫిక్‌నుండి, ఇండియా బర్మాల నుండి సంయుక్తంగా జపానుపై దెబ్బతీయాలి అనే వ్యూహాన్ని క్విబెక్‌లో అంగీకరించలేదు.

— టెహరాన్ సమావేశం (రూజ్‌వెల్టు, చర్చిల్, స్టాలిన్)తో ఈసమావేశాన్ని పోల్చడానికి వీల్లేదు. టెహరాన్‌లో, రెండవ రంగాన్ని గుర్తించి స్పష్టమైన నిర్ణయానికి వచ్చారు. అన్నిదేశాలకు స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలుంటాయని, వాటిమీదనే యూరప్ శాంతిభద్రత లాధారపడి వున్నాయని స్పష్టీకరించారు.

— అన్నిజాతులకు, ప్రజలందరికీ, స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను ఇచ్చుటద్వారానే – వలసదేశాల నణచియుంచే సామ్రాజ్యవాదానికి స్వస్తి చెప్పుటద్వారానే – పసిఫిక్‌లో కూడ శాంతి భద్రతలకు పునాది ఏర్పడుతుందన్న విషయాన్ని చర్చిల్, రూజ్‌వెల్టులు ఈ సమావేశంలో స్పష్టపరచలేకపోయారు. కారణం చర్చిల్ అడ్డురావడమే అని వేరే చెప్పనక్కరలేదు.

ప్రజాశక్తి

★

భారత కమ్యూనిస్టు పార్టీ

ఆంధ్రకమిటీ పత్రిక

★

సంపాదకులు :

మద్దుకూరి చంద్రశేఖరరావు

Printed and Published by Katragadda Rajagopala Rao at Prajasakti Press, Governorpet - Bezwada.

END OF ISSUE